

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 25-08-2025 | సంపుటి - 24 | సంచిక - 108 | రూ : 4 | పేజీలు: 8

## వినాయక చవితి వేళ
# తియ్యని కబురు

- గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్
- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- అనుమతి ఉన్న మండపాలకే ఈ సౌకర్యం వర్తింపు
- ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలు
- వేగంగా జరుగుతున్న హైదరాబాద్ గణేశ్ మండపాల ఏర్పాటు
- తుది దశకు చేరిన ప్రఖ్యాత ఖైరతాబాద్ గణపతి విగ్రహం పనులు



2లో

# కుప్పం చేరుకున్న కృష్ణా జలాలు..
## చెప్పింది చేసి చూపించానన్న సీఎం





2లో

- శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా కుప్పం చేరుకున్న కృష్ణా జలాలు
- నాడు చెప్పాను, నేడు చేసి చూపించానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- అసెంబ్లీలో చేసిన శపథం వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న సీఎం
- పులివెందులకు కూడా నీళ్లు తెచ్చి చూపిస్తానని గతంలోనే స్పష్టం
- కుప్పంలో కృష్ణా జలాలకు టీడీపీ శ్రేణుల ఘన స్వాగతం
- కొబ్బరికాయలు కొట్టి, హారతులతో కాలువ వద్ద సంబరాలు

## కేసీఆర్‌కు
# మళ్లీ అస్వస్థత..
## పర్యవేక్షిస్తున్న ప్రత్యేక వైద్యులు

- షుగర్, సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు
- హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందంతో చికిత్స
- ఫాంహౌస్‌కు చేరుకున్న కేటీఆర్, హరీశ్ రావు ఇతర నేతలు
- అవసరమైతే హైదరాబాద్‌కు తరలించే యోచన



2లో



2లో

## భారత్ లో పర్యటించనున్న
# జెలెన్ స్కీ

- కీవ్ పర్యటనలో జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించిన మోదీ
- ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా టూర్
- ఈ ఏడాది చివరిలో రష్యా ప్రెసిడెంట్ పుతిన్ కూడా భారత్ కు రాక

## ఆకాశంలో భారత్‌కు అభేద్య కవచం..
# డీఆర్‌డీవో మరో ఘన విజయం

- భారత రక్షణ రంగంలో మరో కీలక మైలురాయి
- ఐఏడీడబ్ల్యూఎస్ తొలి ప్రయోగ పరీక్ష విజయవంతం
- ఒడిశా తీరంలో పరీక్షను నిర్వహించిన డీఆర్‌డీవో
- శత్రువుల నుంచి గగనతలానికి బహుళస్థాయి రక్షణ
- డీఆర్‌డీఓ బృందాన్ని అభినందించిన మంత్రి రాజ్‌నాథ్ సింగ్



2లో

## రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి
# దిగజార్చుతున్నారు..



- దేశంలో ఫెడరల్ స్ఫూర్తికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- రాజ్యాంగాన్ని కాపాడటమే తన బాధ్యత అని స్పష్టం
- తమిళనాడు పాలన దేశానికే ఆదర్శమంటూ ప్రశంసలు
- మద్దతు ఇచ్చిన స్టాలిన్‌కు, ఇండియా కూటమికి కృతజ్ఞతలు

2లో

# సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

: కేటీఆర్



2లో

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- పదవులకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో గెలవాలని డిమాండ్
- 20 నెలల పాలనపై రేవంత్ రెడ్డి ప్రజాతీర్పు కోరాలని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు, హైడ్రా ఆగడాలపై తీవ్ర విమర్శలు
- కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గుర్తు చేసిన కేటీఆర్
- నాయకులు మోసం చేసినా కార్యకర్తలు పార్టీతోనే ఉన్నారని ప్రశంస

# రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజార్చుతున్నారు: జస్టిస్ సుదర్శన్ రెడ్డి

దేశంలో ప్రస్తుతం సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, రాష్ట్రాల అధికారాలను హరించి వాటిని కేవలం మున్సిపాలిటీల స్థాయికి తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతిపక్ష ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం చెన్నైలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. "దేశంలో అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నాలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి గొడ్డలిపెట్టు లాంటిది. జీఎస్టీ విధానంలో మార్పులు తీసుకురావడం, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా విధానాలు రూపొందించడం వంటి చర్యలు సమాఖ్య వ్యవస్థను తీవ్రంగా బలహీనపరుస్తున్నాయి. ఈ ప్రయత్నాలు ఇలాగే కొనసాగితే, రాష్ట్రాలు తమ ప్రాముఖ్యతను కోల్పోయి కేవలం మున్సిపాలిటీలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. దేశమంటే రాష్ట్రాల సమాహారం అనే విషయాన్ని అందరూ గుర్తించాలని జస్టిస్ రెడ్డి నొక్కి చెప్పారు. "భారతదేశ బలం భిన్నత్వంలో ఏకత్వంలోనే ఉంది. మన రాజ్యాంగం కూడా రాష్ట్రాల ఐక్యతకే పెద్దపీట వేసింది. ఈ ప్రాథమిక సూత్రాన్ని కాపాడుకున్నప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. సమాఖ్య హక్కుల కోసం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ గట్టిగా పోరాడుతున్నారని ప్రశంసించారు. తన న్యాయవాద వృత్తిని గుర్తుచేసుకుంటూ, "గత 52 ఏళ్లుగా న్యాయమూర్తిగా నేను రాజ్యాంగాన్ని నిలబెట్టాను. ప్రజలు నాకు అవకాశం ఇస్తే, భవిష్యత్తులో కూడా రాజ్యాంగాన్ని కాపాడటానికి, దాని విలువలను పరిరక్షించడానికి కట్టుబడి ఉంటాను. నాపై నమ్మకం ఉంచిన ప్రజలను గానీ, రాజ్యాంగాన్ని గానీ నేను ఎప్పటికీ నిరాశపరచను" అని హామీ ఇచ్చారు. అంతకుముందు, పాలనలో తమిళనాడు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆయన కొనియాడారు. "ఆరోగ్యం, విద్య, సామాజికఆర్థిక అభివృద్ధి వంటి రంగాల్లో తమిళనాడు అద్భుతమైన దార్శనికతతో ముందుకు సాగుతోంది. మానవాభివృద్ధిలో ఈ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉంది," అని పేర్కొన్నారు. తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు ఇండియా కూటమిలోని ఇతర నేతలందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నాపై వారు ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని, రాజ్యాంగ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

## రాహుల్‌కు బిహార్ ఓటమి భయం పట్టుకుంది : అనురాగ్ ఠాకూర్




ఓట్ల చోరీ ఆరోపణలను భాజపా నేత అనురాగ్ ఠాకూర్ ఖండించారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ఇప్పటికే దాదాపు 90 ఎన్నికల్లో పరాజయం పాలయ్యిందని ఎద్దేవా చేశారు. రానున్న బిహార్ ఎన్నికల్లోనూ ఓడిపోతామన్న భయం ఆయన్ను వెంటాడుతోందన్నారు. "ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారి రాహుల్ గాంధీ ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను నిందిస్తుంటారు. ఈసారి పోలింగ్‌కు ముందే.. ఎన్నికల సంఘంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. దేశ రాజ్యాంగ వ్యవస్థపై ప్రతిపక్ష నేతలు విశ్వాసం కోల్పోవడం దురదృష్టకరం'' అని హిమాచల్‌ప్రదేశ్ హమీర్‌పుర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలను బలోపేతం చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందని ఠాకూర్ పేర్కొన్నారు. అవినీతి నేతలపై కఠిన చట్టాలను తీసుకురావడానికి ప్రధాని మోదీ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో దిల్లీలో కొంతమంది మంత్రులు జైలు నుంచే నిర్ణయాలు తీసుకున్నారని, ఫైళ్లపై సంతకాలు చేశారంటూ.. ఆప్ నేతలను ఉద్దేశించి విమర్శలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ఇటువంటి తీరు మంచిది కాదన్నారు.

## కుప్పం చేరుకున్న కృష్ణా జలాలు...
## నాడు చెప్పింది చేసి చూపించానన్న సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా తరలించిన కృష్ణా జలాలు ఎట్టకేలకు కుప్పం గడ్డను తాకాయి. ఈ చారిత్రక ఘట్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "నాడు చెప్పాను... నేడు చేసి చూపించాను" అంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాను అసెంబ్లీ వేదికగా చేసిన శపథాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తుచేశారు. మదనపల్లె, పలమనేరుతో పాటు కుప్పానికి కచ్చితంగా నీళ్లు తీసుకువస్తానని, పులివెందులకు కూడా నీళ్లు ఇచ్చి చూపిస్తానని తాను అన్న మాటల పాత వీడియోను ఆయన తన పోస్టుకు జతచేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, తమ ప్రాంతానికి కృష్ణా జలాలు చేరడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, కూటమి నేతలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. కాలువ వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని పండగ వాతావరణం సృష్టించారు. కృష్ణా జలాలకు కొబ్బరికాయలు కొట్టి, హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ జెండాలు చేతబూని కాలువలో దిగి తమ ఆనందాన్ని నినాదాల రూపంలో వ్యక్తం చేశారు. ఈ భావోద్వేగ క్షణాలకు సంబంధించిన వీడియోలను తెలుగుదేశం పార్టీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది.

## వినాయక చవితి వేళ తియ్యని కబురు చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు ఒక తీపికబురు అందించింది. వినాయక చవితి, దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, అయితే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేసింది. ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మండపాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులు తుది ఘట్టానికి చేరుకున్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మండపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది.

## చట్టసభలు.. ప్రజా సమస్యలపై చర్చించడానికే గానీ.. రాజకీయ లబ్ధికి కాదు: అమిత్ షా



దిల్లీ: చట్ట సభలు.. ప్రజాసమస్యలపై చర్చలు జరపడానికే గానీ.. రాజకీయ లబ్ధి పొందేలా వ్యవహరించడానికి కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దిల్లీలో జరుగుతున్న 'ఆల్ ఇండియా స్పీకర్స్ సమావేశం'లో కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలు దేశాభివృద్ధిని ప్రభావితం చేస్తాయని చెప్పారు. ''చర్చలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని గురించి ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలి. అర్థవంతమైన చర్చలు జరగాలి. సభా గౌరవాన్ని, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రజాసమస్యలపై నిష్పాక్షపాతమైన చర్చలు జరపడానికి చట్ట సభలను వేదికగా మార్చుకోవాలి. వాటి నిబంధనల మేరకు సమావేశాలు జరిగేలా చూడాలి''అని అన్నారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలి భారతీయ స్పీకర్‌గా పనిచేసిన విఠల్‌భాయ్ పటేల్‌కు కేంద్రమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. వందేళ్ల క్రితం స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికతోనే దేశంలో పార్లమెంటరీ చరిత్ర మొదలైందన్నారు. అప్పటి బ్రిటిష్ పాలనలో 1919 డిసెంబర్ 24న దేశంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఏర్పాటైంది. 1925లో విఠల్‌భాయ్ పటేల్ ఈ సభకు స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

## సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే తక్షణమే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి, ఉప ఎన్నికలను ఎదుర్కొని గెలవాలని ఆయన సవాల్ విసిరారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొని ఉప ఎన్నికలకు రావాలని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో ఓటమి భయం మొదలైందని కేటీఆర్ అన్నారు. అందుకే వారు రాజీనామా చేసేందుకు వెనుకాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే 'హైడ్రా' వ్యవస్థ పనిచేస్తోందని, దాని ఆగడాల వల్ల ఒకప్పుడు దేశానికే తలమానికంగా ఉన్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు కంటే, రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల కాలంలోనే ఎక్కువ అప్పులు చేశారని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని కేటీఆర్ నిలదీశారు. గతంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిందని కేటీఆర్ గుర్తుచేశారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నప్పటికీ, కేసీఆర్ నాయకత్వంలో ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. దీంతో నగరంలో ఇన్వర్టర్లు, జనరేటర్ల అవసరమే లేకుండా పోయిందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయకుండా హైదరాబాద్‌ను అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా అభివృద్ధి చేశామని చెప్పారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ పండుగలకు సమ ప్రాధాన్యత ఇస్తూ మతసామరస్యాన్ని కాపాడామని అన్నారు. అందుకే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా గులాబీ జెండాకే పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యేతో సహా పార్టీ మారిన వారంతా ప్రజల కోసం కాదని, కేవలం తమ స్వార్థ ప్రయోజనాలు, ఆర్థిక లాభాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే, ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి చూపించాలని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం టైంపాస్ మాటలు చెబుతూ, కేసీఆర్‌పైన, తనపైన కేసులు పెడతామని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు పార్టీని మోసం చేసి వెళ్లినా, బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## డీకే శివకుమార్ బాటలో మరో ఎమ్మెల్యే.. ఆరెస్సెస్ గీతాలపన



బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీలో ఇటీవల డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరెస్సెస్ గీతాన్ని ఆలపించి చర్చకు తెరలేపారు. తాజాగా ఆయన బాటలోనే మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రంగనాథ్ ఆరెస్సెస్ గీతాలపన చేశారు. అంతేకాదు.. ఆ గీతాన్ని ఆలపించడంలో తప్పేముందని వ్యాఖ్యానించారు. తుమకూరు జిల్లా కునిగల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రంగనాథ్ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన ఆరెస్సెస్ గీతం 'నమస్తే సదా వత్సల'ను ఆలపించారు. 'ఈ గీతం చాలా బాగుంది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అసెంబ్లీలో ఆలపించిన తర్వాత నేనూ విన్నాను. దాని అర్థం కూడా తెలుసుకున్నాను. జన్మభూమికి వందనం చేయాలి అనే అర్థముంది. అందులో నాకేమి తప్పుగా అనిపించలేదు. కాంగ్రెస్.. లౌకిక పార్టీ. మేం ఇతరుల నుంచి మంచిని స్వీకరిస్తాం. ఆరెస్సెస్ గీతాన్ని ఆలపించడంలో తప్పేముంది?''అని అన్నారు. కులాలు, మతాల పేరుతో భాజపా రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే రంగనాథ్ విమర్శించారు. వాటిని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మా సిద్ధాంతాలు, వారి సిద్ధాంతాలు ఎప్పటికీ కలవలేన్నారు.

## భారత్ లో పర్యటించనున్న జెలెన్ స్కీ

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్ స్కీ త్వరలో భారత్ లో పర్యటించనున్నట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగు పర్చుకోవడమే ఈ పర్యటన ఉద్దేశమని ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్ చుక్ తెలిపారు. జెలెన్ స్కీ పర్యటనకు సంబంధించి తేదీలను ఖరారు చేయడంపై కసరత్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గతేడాది ఆగస్టులో కీవ్ ను సందర్శించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించారు.

*** ఉక్రెయిన్‌లో శాంతి కోసం ప్రధాని మోదీ ఒత్తిడి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతి కోసం వాదిస్తూ "ఇది యుద్ధ యుగం కాదు" అని నొక్కి చెప్పారు. పుతిన్, జెలెన్ స్కీలతో టెలిఫోన్ సంభాషణలు జరిపారు. భారతదేశం రెండు దేశాల మధ్య శాంతిని కోరుకుంటుందని వెల్లడించారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ ఏడాది చివరలో భారత్ కు రానున్నారు.

## ఆకాశంలో భారత్‌కు అభేద్య కవచం.. డీఆర్‌డీవో మరో ఘన విజయం

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) తన అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన అస్త్రాన్ని చేర్చింది. దేశ రక్షణ సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చే క్రమంలో శనివారం ఒడిశా తీరంలో ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూఎస్) తొలి ప్రయోగ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించారు. ఈ చారిత్రాత్మక విజయంపై డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, భారత సాయుధ దళాలను, పారిశ్రామిక వర్గాలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. "ఐఏడీడబ్ల్యూఎస్ విజయవంతమైన అభివృద్ధికి కృషి చేసిన డీఆర్‌డీవో, సాయుధ దళాలు, పరిశ్రమలకు నా అభినందనలు. ఈ ప్రత్యేకమైన ప్రయోగ పరీక్ష మన దేశ బహుళస్థాయి గగనతల రక్షణ సామర్థ్యాన్ని రుజువు చేసింది. శత్రువుల వైమానిక దాడుల నుంచి దేశంలోని కీలక ప్రాంతాలకు, ముఖ్యమైన సంస్థలకు ఇది మరింత పటిష్ఠమైన రక్షణ కల్పిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూఎస్) అనేది ఒకే వ్యవస్థ కాదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బహుళస్థాయి రక్షణ వ్యవస్థ. ఇందులో క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (క్యూఆర్‌శామ్), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వీషోరాడ్స్) క్షిపణులతో పాటు అధిక శక్తివంతమైన లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ) కూడా ఉన్నాయి. ఈ వ్యవస్థలన్నీ కలిసి భారత గగనతలానికి ఒక అభేద్యమైన రక్షణ కవచంగా పనిచేస్తాయని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఉక్రెయిన్‌కు మరో 3,350 క్షిపణులు పంపనున్న అమెరికా

వాషింగ్టన్: ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరో 3,350లకు పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ క్షిపణులను ఆ దేశానికి అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆయుధ ప్యాకేజీకి యూరోపియన్ దేశాలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపాయి. దాదాపు ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయని సమాచారం. అయితే 240 నుంచి 450 కి.మీ పరిధి కలిగిన ఈఆర్ఏఎమ్ క్షిపణులను రష్యాపైకి ప్రయోగించాలంటే ఉక్రెయిన్ పెంటగాన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు రష్యా భూభాగంలోని లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా రూపొందించిన లాంగ్‌రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్ను వినియోగించకుండా పెంటగాన్ అడ్డుకుంటున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. మాస్కో చేపడుతున్న దాడులకు దీటుగా ఆయుధాలను ఉపయోగించకుండా కీవ్ సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పేర్కొన్నాయి. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇరుదేశాల నేతలు ముందడుగు వేస్తుండకపోవడంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు సహాయంగా అగ్రరాజ్యం పలుమార్లు పెద్ద మొత్తంలో ఆయుధ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌కు 32.2 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, అత్యాధునిక క్షిపణులు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది

## కేసీఆర్‌కు మళ్లీ అస్వస్థత.. పర్యవేక్షిస్తున్న ప్రత్యేక వైద్యులు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) శనివారం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్యుల బృందం వెంటనే అక్కడికి చేరుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కేసీఆర్ రక్తంలో చక్కెర (షుగర్), సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైద్య బృందం ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. తండ్రి అనారోగ్య వార్త తెలియగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తన కుమారుడు హిమాన్షుతో కలిసి స్వయంగా కారు నడుపుకుంటూ ఫాంహౌస్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి కూడా ఎర్రవల్లికి వచ్చి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వైద్యుల బృందం ఫాంహౌస్‌లోనే ఉండి కేసీఆర్ ఆరోగ్యాన్ని నిరంతరం గమనిస్తోంది. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా అక్కడే ఉండి వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.

# తల్లి పాలు తాగి తల్లి రొమ్ము గుద్దే వ్యక్తి అరెకపూడి గాంధీ

* **దమ్ముంటే నువ్వు ఏ పార్టీనో చెప్పాలి**
* **శేరిలింగంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్**






శేరిలింగంపల్లి, ప్రజాస్పూర్తి : శేరిలింగంపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం మియాపూర్ లోని నరేన్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు కూకట్పల్లి శాసనసభ్యులు శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ మాధవరం కృష్ణారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎల్లప్పుడూ తన అండ ఉంటుందని, ఎవరి సమస్యలకైనా తాను పక్కన నిలబడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పార్టీ వదిలినా ప్రజల కోసం తాము పనిచేస్తూనే ఉన్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా నాతోపాటు కుకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మీకు అండగా ఉంటాడని భరోసా ఇచ్చాడు. కెసిఆర్ ముఖ్యమంత్రి గా వున్నప్పుడు రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా శేరిలింగంపల్లికి అధిక నిధులు ఇచ్చి అభివృద్ధి - సంక్షేమం పెద్ద ఎత్తున చేశామన్నారు.9,500 కోట్లతో రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించామని చెప్పారు... ఒక లక్ష మందికి పట్టాలు, పెన్షన్లను రూ.200 నుండి రూ.2000కి పెంచామని గుర్తు చేశారు... శేరిలింగంపల్లి "మినీ భారతదేశం" లాంటిదని అన్ని రాష్టాలు ప్రజలు ఇక్కడ నివసిస్తారని వారందరికి టిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

**కాంగ్రెస్ పై ఘాటు విమర్శలు చేసిన కేటీఆర్**

వంద రోజుల్లో అన్నీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు.నోటికొచ్చినట్లుగా 420 హామీలు ఇచ్చి ఒక్కటీ నిలబెట్టుకోలేదన్నారు. హైడ్రా ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో బ్లాక్‌మెయిల్ జరుగుతోందని, పేదల ఇళ్లు కూల్చి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్ప కూల్చారని, పేదల మీద హైడ్రా ప్రతాపం చూపిస్తూ బడా బాబులకు కొమ్ముకాస్తుందని ఆయన అన్నారు.దుర్గం చెరువు పరిధిలో రేవంత్ రెడ్డి అన్న ఇళ్లు ఉంటే వాటిని కూల్చే ధైర్యం కాంగ్రెస్ కు లేదా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు.భవిష్యత్తులో ఉప ఎన్నికలు తప్పక వస్తాయని, కాంగ్రెస్ రోజులు దగ్గరలో ముగియబోతున్నాయని ఆయన స్పష్టం చేశారు. శేర్లింగంపల్లి లో పార్టీ పునర్వ్యవస్థీకరణ కోసం కొత్త కమిటీలు ఏర్పాటు చేసి అందరూ కలసి పని చేయాలని పిలుపునిచ్చారు..తెలంగాణలో మళ్ళీ కెసిఆర్ నాయకత్వం రావాలంటే ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

**స్థానిక ఎమ్మెల్యే పై విమర్శలు**

**గుప్పిచ్చిన కేటీఆర్...**

తను ఆస్తులను కాపాడుకోవడం కోసమే శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరెకిపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరాడని అన్నారు. నీకేమైనా విలువలు ఉంటే ప్రస్తుతం నువ్వు ఏ పార్టీలో ఉన్నావో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వం శేరిలింగంపల్లిని అభివృద్ధి చేస్తే శేర్లింగంపల్లి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరి చెరువుల కబ్జాలకు పాల్పడ్డాడని అన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రజలు గాంధీకి సరైన బుద్ధి చెబుతారని తెలిపారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలను అభివృద్ధి పరుస్తాం

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :గాజుల రామారం డివిజన్ రాజీవ్ గృహకల్ప ఇళ్ల సముదాయ వాసులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. సముదాయంలో ప్రార్థనా మందిరాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని వారు ఎమ్మెల్యేను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే అనేక సౌకర్యాలను కల్పించామని అన్నాడు. రానున్న రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలను అభివృద్ధి పరుస్తామని అన్నారు. అనంతరం ప్రార్థనా మందిరాల నిర్మాణానికి అనువైన స్థలాలను కేటాయించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల అసోసియేషన్ సభ్యులు షేక్ సాజిద్, వేణు సాదుల, నాయుడు, ఖయూమ్, రెహమాన్, మోహన్ రెడ్డి, అంజద్, కృష్ణ, మున్నా, షఫీ, ప్రమీల, లక్ష్మి, చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్: వాతావరణ ప్రభావం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విశ్వకర్మ కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ లో ఆదివారం నారాయణమల్లారెడ్డి ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరం లో 210 మందికి బీపీ, షుగర్ , టెంపరేచర్, బరువు ఆడవారికి ఎగ్జామినేషన్ చెకప్ చేసి వారికి తగిన మందులు ఉచితంగా పంపిణి చేసారు.అవసరం అయిన వారికి ఉచితముగా హెల్త్ కార్డు ఇచ్చి దాని ద్వారా ట్రీట్మెంట్ , ఆపరేషన్లు కూడా ఉచితముగా చేస్తాం అని డాక్టర్ల బృందం తెలిపారు.ఈ క్యాంపు కార్యక్రమంలో స్త్రీ సంబంధిత వ్యాధుల డాక్టర్ల బృందం,క్యాంప్ ఆర్గనైజర్లు, నర్సింగ్ సిబ్బంది, ఫార్మసీ సిబ్బంది విశ్వకర్మ కాలనీ నాయకులు , యువకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## టేకులపల్లి మండల పీ డి ఎస్ యు నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పి డి ఎస్ యు ఆధ్వర్యంలో మహాసభజరిగిన అనంతరం పీ డి ఎస్ యు నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. శనివారం టేకులపల్లి మండలం కేంద్రంలో గల జూనియర్ కళాశాలలో జరిగిన టేకులపల్లి మండలం పిడిఎస్యు 23వఈ మహాసభలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, మండలంలోని, విద్యా సంస్థలలో ఉన్న సమస్యలపై నూతన కార్యాచరణ తో పలు తీర్మానాలను ఈ మహాసభ ఆమోదించిందని జిల్లా కార్యదర్శి జె గణేష్ తెలిపారు. మండల నూతన కమిటీ అధ్యక్షురాలు: జి.రాజేశ్వరి ఉపాధ్యక్షురాలు: బి ఉష ప్రధాన కార్యదర్శి: ఎ.లోకేష్ సహాయ కార్యదర్శి: ఉపేందర్ కోశాధికారి: బి.దీపిక సభ్యులు, ఎన్ సాయికిరణ్.వి.తీలక్.దిలీప్. అజయ్ మొత్తం 9 మందితో నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి జె గణేష్ తెలిపారు.



## శ్రీ శ్రీ శ్రీ ఊర ముత్యాలమ్మ ఒడి బియ్యం
## అన్నప్రసాద వితరణ

చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14వ వార్డులోని శ్రీ ఊర ముత్యాలమ్మ దేవస్థానంలో అమ్మవారి ఒడిబియ్యం వండి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ సీనియర్ నాయకుడు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ చేతుల మీదగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తుల విప్లవ కుమార్ మాట్లాడుతూ గత వారం అమ్మవారి భోనాలు దేవస్థాన అధ్యక్షుడు సందగళ్ళ సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తొర్పునూరు రవి గౌడ్ ల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. అమ్మవారి ఒడిబియ్యం వండి భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించినందుకు దేవస్థాన కమిటీని అభినందించారు. అమ్మవారి ఆశీర్వాదంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ ప్రముఖులు చింతల తిరుమల్ రెడ్డి, బత్తుల శ్రీశైలం గౌడ్, తొర్పునూరి మల్లేష్ గౌడ్, అన్నమోని గోవిందరాజు, ఉష్కాగుల శ్రీనివాస్, సుర్వి నర్సింహ గౌడ్, చింతకింది అంజయ్య గౌడ్, బొంగు జంగయ్య గౌడ్, గుజ్జుల సురేందర్ రెడ్డి, తాడూరి పరమేష్, తొర్పునూరి సాయిలు, జక్కర్తి శేఖర్, ఉష్కాగుల నాగరాజు, ఊడుగు రమేష్ గౌడ్, పబ్బు శ్రీకాంత్, సందగళ్ళ నాగరాజుగౌడ్, బొంగు శ్రీనివాస్, రాజపేట అశోక్, తొర్పునూరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఈ నెల 25వ తారీఖున
## చలో కలెక్టర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

* **సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : ఈ నెల 25వ తారీఖున చలో కలెక్టర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సిపిఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం షాపూర్ నగర్ పార్టీ కార్యాలయంలో పసుల అంజయ్య అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సభ్యులు శాఖా కార్యదర్శుల సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇప్పటివరకు తాను ఇచ్చిన వాగ్దానాలను అమలుపరచలేదనీ పేదలకు ఇందిరమ్మ ఇండ్లు , కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు ఇప్పటివరకు ఇవ్వలేదు తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు వాగ్దానాలను అమలు చేయాలని ప్రజల స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 25న ఉదయం 10 గంటలకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. గత 15 రోజుల నుండి సూరారం డివిజన్లో పలు బస్తీలలో ప్రజా సమస్యల మీద సర్వేలు నిర్వహించి సమస్యలు తెలుసుకోవడం జరిగిందని, ప్రధానంగా సూరారం డివిజన్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండి మాన్యువల్స్ నుండి మురుగునీరు రోడ్లమీద పారుతూ ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని గుంతల మయంగా రోడ్లు ఉన్నాయని షాపూర్ నగర్ మార్కెట్ రోడ్డు రాజీవ్ గాంధీ పార్కు దగ్గర నుండి షాపూర్ నగర్ సిఎంఆర్ స్కూల్ వరకు షాపూర్ నగర్ బొడ్రాయి నుండి మారుతి మెడికల్ హాల్ వరకు పూర్తిగా ఆక్రమణకు గురై ప్రజలు నడవడానికి కూడా అసౌకర్యంగా ఉందన్నారు. ఎమర్జెన్సీ టైంలో కనీసం అంబులెన్స్ వచ్చే దారి కూడా లేదని డివిజన్లో కమ్యూనిటీ హాల్స్ ఉన్న ప్రజల అవసరాలకు ఉపయోగపడకుండా శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వాటిని వెంటనే గుర్తించి ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు సౌకర్యాలు లేవని కనీసం మంచినీళ్లు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రభుత్వ పాఠశాలల బాత్రూంల దగ్గర నుండి వెళితేనే ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుందన్నారు. లోపలికి వెళ్ళే విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచన చేయాలని అన్నారు. డివిజన్లో ఉన్న అంగన్వాడీ సెంటర్లకు కూడా సొంత భవనాలు లేక అద్దె రూములలో పిల్లలు, టీచర్స్ ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే అంగన్వాడి సెంటర్ల అన్నింటికి సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, కరుణాకర్, భాష తదితరులు పాల్గొన్నారు

## నేనున్నానని.... ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా

* **బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ**



ప్రజాస్ఫూర్తి, దుండిగల్ :దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ను నియోజకవర్గానికి చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, పలువురు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీలో వున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఆయన వారికి తెలిపారు.

## కమ్యూనిస్ట్ వీరునికి తుది వీడ్కోలు

* **చరిత్ర ఉన్నంత కాలం సురవరం పేరు మరువరు**
* **జోహార్ సురవరం సుధాకర్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చరిత్ర ఉన్నంత కాలం సురవరం సుధాకర్ రెడ్డి సేవలను పేద ప్రజలు మరువరని సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయంపై పూలమాలవేసి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి విప్లవ జోహార్లు తెలిపి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ సిపిఐ నాయకులు ఉడత రామలింగం, కొండూరు వెంకటేష్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, రండి నరసింహ తదితరులున్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి తరలివెళ్ళిన నాయకులు, కార్యకర్తలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్పూర్తి) : నరీన్ గార్డెన్స్ లో ఆదివారం జరిగిన శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ఆధ్వర్యంలో వివేకానంద నగర్ డివిజన్ ముఖ్య నాయకులు మహిళా నాయకులు కార్యకర్తలతో కలిసి భారీగా బయలుదేరి వేళ్ళారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

# రోడ్డుపైన పేరుకుపోయిన మట్టిని తొలగించి శుభ్రం చేయాలి

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : రోడ్డుపైన పేరుకుపోయిన మట్టిని తొలగించి శుభ్రం చేయాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీ లో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తూ కాలనీ వాసులకు ఇబ్బందిగా ఉందన్న విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కాలనీ లో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వరద నీటి సమస్య గురించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వర్షపు నీటితో పాటు మట్టి కూడా రోడ్డు మీద రావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురవడంతో కాలనీ లలో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తూ సమస్యలు వస్తున్నాయన్నారు. జి.హెచ్.ఎం.సి, మాన్ సున్ , హైడ్రా సిబ్బంది సకాలంలో స్పందించి వెంటనే పరిష్కరిస్తున్నారని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలిగిన,(ఎలక్ట్రికల్, రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి) వంటి సమస్య లు ఎదురైన, వెంటనే సంబంధిత అధికారులకు



గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదించాలని తెలియచేసారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు , మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్ , డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, ఆంజనేయ ప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## కన్సాన్ పల్లిలో ఘనంగా శ్రావణమాసం ముగింపు వేడుకలు

**- ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండల పరిధిలోని కన్సాన్ పల్లి గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నధాన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ట్రాక్టర్ యూనియన్ నాయకులు గ్రామంలోని హనుమాన్ మందిరం ఇట్టి కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పురోహితులు ఆనంద్ శర్మ యూనియన్ సభ్యుల చేత ఆలయంలో ప్రత్యేక పూజలను జరిపించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ప్రతియేటా నిర్వహించినట్లు గానే శ్రావణమాసం పురస్కరించుకుని భక్తులు ఆలయంలో నెలరోజుల పాటుగా భజన కార్యక్రమాలు నిర్వహించి ముగింపు సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టడం కొన్నేళ్లుగా అనవాయితీని కొనసాగింపుగా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అన్నదానం ద్వారా భక్తులకు దైవ ఆశీస్సులు లభిస్తాయని, పుణ్యం కూడా వస్తుందని నమ్ముతున్నామని ఇది ఒక సంప్రదాయమన్నారు. అన్నదానం చేయడం ద్వారా, భక్తులు ఆలయాల అభివృద్ధికి, నిర్వహణకు సహకరించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు రామన్నగారి కిష్టయ్య, ఉపాధ్యక్షుడు తలారి పెంటయ్య, సభ్యులు మొరబోయిన ఈశ్వర్,ఆర్. దత్తు, చాకలి ఆశయ్య, దుర్గయ్య, నవీన్, సంతోష్,ప్రశాంత్, క్రిష్ణ,శివ, క్రిష్ణమూర్తి, కిట్టు, మహేష్, ప్రవీణ్, కిరణ్, సంతుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) :ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ పరిధి ఆదర్శ్ నగర్ లోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, అమ్మవారి కృపాకటాక్షలతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సూలముల గోపాల్, ప్రధాన కార్యదర్శి టీ.శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి కె . సాగర్ రావు, సభ్యులు కృష్ణ, చారి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, తెలంగాణ సాయి, శేషా చారి, నగేష్, శివ నాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 28 నుంచి 30వరకు జనసేన విస్తృతస్థాయి భేటీలు

విశాఖపట్నం: ఈ నెల 28 నుంచి 30 వరకు విశాఖలో విస్తృతస్థాయి భేటీ నిర్వహించనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. జనసేన ఎమ్మెల్యేలతో కలిసి విశాఖలో ఆయన 'సేనతో సేనాని' కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 28న జనసేన లెజిస్లేటివ్ పార్టీ సమావేశం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. '' ఈ నెల 29న పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా చర్చిస్తాం. పర్యావరణం, రక్షిత మంచినీటి పథకం, ఉపాధి కల్పన, ఏడాది నుంచి అందించిన సుపరిపాలనపై చర్చిస్తాం. ఈ నెల 30న జనసేన మహాసభలో పవన్ కల్యాణ్ పాల్గొంటారు'' అని నాదెండ్ల తెలిపారు.




## ఆర్యవైశ్య మహాసభ
## వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు దారా రమేష్‌సారథ్యంలో ఆదివారం స్థానిక దారా ఫంక్షన్ హాల్లో నూతన వివాహ, పునర్వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. 150 మంది యువతీ, యువకులలో పాటు దాదాపు 400 మంది ఆర్యవైశ్యులు హాజరై సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా దారా మాట్లాడుతూ 32 ఏళ్ల తర్వాత ఉమ్మడి జిల్లాలో తొలి సారిగా ఉచితంగా ఈ వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశామని. ఊహించని స్థాయిలో అద్భుతమైన స్పందన లభించిందని తెలిపారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ముఖ్యంగా పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. త్వరలో సంక్షేమ సంఘం భవనం నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వచ్చానని, చిత్తశుద్ధితో అమలు పరుస్తున్నానని చెప్పారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో హాజరు కావడం పట్ల హర్షం ప్రకటించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భద్రాద్రి జిల్లా గౌరవాధ్యక్షులు పెండ్యాల విజయభాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు, మధిర మండల అధ్యక్షులు చారుగుండ్ల లక్ష్మీ నర్సింహం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు. భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, కోశాధికారి శీమకుర్తి తాతా శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ వందనపు శ్రీధర్, వాణిజ్య కమిటీ చైర్మన్ కూరా శ్రీధర్, రాజకీయ కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు, చిత్తులూరి ఉమ. దారా సుభాషిణి, వందనపు జ్యోతి. ప్రశాంతి, నరేంద్రుల శిరీష, శీమకుర్తి అరుణ, దారా మాధురి, దారా ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన సంక్షేమ సంఘానికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

ప్రజాస్ఫూర్తి, జీడిమెట్ల :సూరారం డివిజన్ టీఎస్ఐఐసి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా టీఎస్ఐఐసీ కాలనీ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిహెచ్ఎంసి లోని అన్ని డివిజన్లలో గత పన్నెండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామన్నారు. రానున్న రోజుల్లో కూడా టీఎస్ఐఐసీ కాలనీ అభివృద్ధిలో నూతన సంక్షేమ సంఘం కార్యవర్గానికి నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు నేతి రాజా, ఉపాధ్యక్షులు గోపి యాదవ్, ప్రధాన కార్యదర్శి గిరిధర్, కోశాధికారి కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షులు చెక్క సురేష్ బాబు, కమిటీ ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సురవరం అంతిమయాత్ర..
## గాంధీ మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత



హైదరాబాద్: కమ్యూనిస్టు దిగ్గజం సురవరం సుధాకర్‌రెడ్డి అంతిమయాత్ర ముగిసింది. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాల అనంతరం మగ్దూం భవన్ నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర.. గాంధీ మెడికల్ కళాశాల వరకు కొనసాగింది. మగ్దూం భవన్ వద్ద గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అంతిమయాత్ర ముగిసిన అనంతరం సురవరం భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు ఆయన కుటుంబసభ్యులు అప్పగించారు. అంతిమయాత్ర పొడవునా 'కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అమర్ రహే' అంటూ సీపీఐ కార్యకర్తలు, నాయకులు నినాదాలు చేశారు. అంతిమయాత్రలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి.. శుక్రవారం రాత్రి హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే.

## ధర్మోజిగూడెం గ్రామ స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

*** సిపిఎం పోరుబాట**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సిపిఎం పార్టీ జిల్లా కమిటీ పిలుపు మేరకు చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో ఆదివారం సిపిఎం పోరుబాట కార్యక్రమంలో నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలో గుర్తించిన సమస్యలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లు, స్ట్రీట్ లైట్లు సమస్యలను గుర్తించారు. గ్రామ కెమికల్ కంపెనీల కెమికల్ కలిసి పాడైన నీళ్ల సమస్యలు, గ్రామంలో సర్వే చేసి గుర్తించిన సమస్యలున్నాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు మాట్లాడుతూ ధర్మోజిగూడెం నేషనల్ హైవే నుంచి దోతిగూడెం వరకు బీటీ రోడ్డు గుంతల మయంగా మారిందని, ఆ రోడ్డును పూర్తి చేయాలనన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు వెంటనే పూర్తి చేయాలని, గ్రామంలో దోమల సమస్యతో ప్రజలు డెంగ్యూ మలేరియా రోగాలకు గురవుతున్నారని తక్షణమే అధికారులు స్పందించి గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి కొంతం శ్రీనివాస్ రెడ్డి, డివైఎఫ్ఐ మాజీ మండల అధ్యక్షుడు సామిడి నాగరాజు రెడ్డి, పార్టీ సభ్యులు పగిళ్ల శశిరేఖ, పకీరు పెంటారెడ్డి, జంగం అంజయ్య, జంగం రాములు, ఐతరాజు సోమయ్య, ఎస్సగొని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రో ఐఏడీటీ01 సక్సెస్.. గగన్ యాన్ మిషన్‌లో మరో ముందడుగు

భారతదేశం మొదటి మానవ సహిత అంతరిక్ష యాత్ర కోసం ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్



యాన్ మిషన్‌లో మరో కీలక అడుగు ముందుకు పడింది. వ్యోమగాములు అంతరిక్షం నుంచి భూమికి సురక్షితంగా తీసుకువచ్చే పారాచూట్ వ్యవస్థ పనితీరును పరీక్షించేందుకు చేపట్టిన 'ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇవాళ తెల్లవారుజామున శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, డీఆర్‌డీవో, ఇండియన్ నేవీ, ఇండియ కోస్ట్ గార్డ్ దళాలు ఉమ్మడిగా ఈ పరీక్షను నిర్వహించినట్లు ఇస్రో తన అధికారిక ఎక్స్‌లో పోస్టు చేసింది. అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చే క్రమంలో వ్యోమగాములు ఉండే మాడ్యూల్ వేగాన్ని నియంత్రించి, దానిని సురక్షితంగా ల్యాండ్ చేసేలా ఈ పారాచూట్ వ్యవస్థ మొదటి నుంచి చివరి వరకు ఎలా పని చేస్తుందో సమగ్రంగా నిరూపించేందుకే తాజాగా ఈ ఐఏడీటీ01 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో గగన్ యాన్ మిషన్ మరో కీలక మైలురాయి అధిగమించినట్లైంది.

## గుంటూరులో భారీ అగ్నిప్రమాదం.. పది కార్లు దగ్ధం

అగ్నిప్రమాదం లో పది కార్లు దగ్ధమైన ఘటన గుంటూరులో జరిగింది. స్థానిక ఆటో నగర్‌లో ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. దీంతో మంటలు భారీగా వ్యాపించాయి. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో ఉన్న కార్లకు మంటలు అంటుకున్నాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పారు. అయితే అప్పటికే పది కార్లు దగ్గమయ్యాయి. స్థానికంగా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ రెండోదశ జనహిత యాత్ర.. హాజరైన ముఖ్యనేతలు

చొప్పదండి: కరీనంగర్ జిల్లా చొప్పదండిలో కాంగ్రెస్ రెండోదశ జనహిత యాత్ర కొనసాగుతోంది. ఆదివారం గంగాధర మండలం ఉప్పరమల్యాల నుంచి మధురానగర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పాదయాత్రలో పాల్గొన్నారు.





## బీసీ బిల్లు అంశాన్ని అమిత్ షా వద్ద ప్రస్తావించిన తెలంగాణ స్పీకర్

దిల్లీ: దిల్లీలో జరుగుతున్న స్పీకర్ల సదస్సులో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ప్రారంభోపన్యాసం తర్వాత తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసి బీసీ రిజర్వేషన్ల బిల్లు అంశాన్ని ప్రస్తావించారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లోనే ఉందని స్పీకర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రత్యేకంగా మిమ్మల్ని కలిశారని గుర్తు చేశారు. బీసీ బిల్లు విషయం చూస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో అమిత్ షా అన్నట్టు సమాచారం.





## ఇన్నోవా కారులో కొకైన్ తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్: కారులో కొకైన్ తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీమ్ అరెస్ట్ చేసింది. నారాయణగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్.అంజిరెడ్డి వెల్లడించారు. రామ్‌కోఠిలోని వర్ధమాన్ బ్యాంక్ వద్ద చేపట్టిన తనిఖీల్లో ఇన్నోవా కారులో కొకైన్ తరలిస్తుండగా ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. నాంపల్లికి చెందిన మిస్బాహిద్దీన్ ఖాన్, బంజారాహిల్స్‌కు చెందిన అలీ అస్గర్ గులాబీ, జుబైర్ అలీ (యూఎస్‌ఏ సిటిజన్)ను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 33.3 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు.

## తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అనుమతి తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నారు. ఈనెల 27 నుంచి గణేశ్ ఉత్సవాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో గణేశ్ మండపాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రాముఖ్యత పొందిన ఖైరతాబాద్ గణనాథుడిని విగ్రహ నిర్మాణం తుది దశకు చేరుకుంది.

## తెలంగాణ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది



జగదేవ్‌పూర్: సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్ రావు పర్యటించారు. వైరల్ జ్వరాలతో చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన మహేశ్ (35), శ్రవణ్ (15) కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశుద్ధ్యం లోపించిందని, ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని విమర్శించారు. తిమ్మాపూర్‌లో డెంగీ జ్వరాలతో ఇద్దరు చనిపోయారన్నారు. మరో 40 నుంచి 50 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గ్రామాలకు నిధులు లేక పంచాయతీ సెక్రటరీలు సమ్మె నోటీసు ఇచ్చారని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి పాట... హనుమంతరావు మాస్ స్టెప్పులు

కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాస్ స్టెప్పులు వేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రేవంత్ రెడ్డి ఎన్నికల సాంగ్ అయిన మూడు రంగుల జెండా పాటకు ఆయన వేసిన హుషారుగా స్టెప్పులు వేశారు. కాగా రాష్ట్రంలో రెండో విడత జరుగుతున్న జనహిత పాదయాత్ర నేడు కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో సాగింది. కాగా అక్కడ జరిగిన ర్యాలీలో హనుమంతరావు మాస్ స్టెప్పులు కార్యకర్తల్లో జోష్ ను నింపాయి. ఎప్పుడూ తన మాటలతో అలరించే హనుమంతరావు ఈసారి డ్యాన్స్ వేయడం జనహిత ర్యాలీకి కొత్త ఊపును తీసుకు వచ్చిందని కాంగ్రెస్ నేతలు అభివర్ణించారు.

# మీర్‌పేట ఘటన తరహాలో మరో దారుణం ..

### భార్యను ముక్కలు చేసి మూసీలో పడేశాడు

హైదరాబాద్: మీర్‌పేటలో ఆర్మీ మాజీ ఉద్యోగి గురుమూర్తి తన భార్యను అత్యంత క్రూరంగా చంపిన ఘటన మరువక ముందే మరో దారుణం చోటు చేసుకుంది. భార్యను చంపి మృతదేహాన్ని ముక్కలు చేసి మూసీలో పడేసి భర్త మిస్సింగ్ నాటకమాడాడు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలోని బోడుప్పల్‌లో ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. ఈ కేసు వివరాలను మల్కాజిగిరి డీసీపీ పద్మజ మీడియాకు వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన స్వాతి (25), మహేందర్ ఏడాదిన్నర క్రితం ప్రేమవివాహం చేసుకొని బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నారు. గత కొంతకాలంగా వీరిమధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 23న సాయంత్రం పథకం ప్రకారం మహేందర్‌రెడ్డి తన భార్య స్వాతిని కొట్టి బెడ్ మీద పడేశాడు. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిన తర్వాత యాక్సా బ్లేడ్‌తో తల, మొండెం, కాళ్లు, చేతులు వేరు చేశాడు. రాత్రి సమయంలో బయట పెట్రోలింగ్ ఉండటంతో ఎవరికీ అనుమానం రాకుండా చిన్న చిన్న కవర్లలో ముక్కలు తీసుకెళ్లి మూసీ నదిలో పడేశాడు. తల ఒక సారి, కాళ్లు ఒకసారి, చేతులు ఒకసారి ఇలా మూడు సార్లు మూసీ వద్దకు వెళ్లి విసిరేశాడు. శవాన్ని మాయం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నించాడు. ఇదంతా కప్పిపుచ్చేందుకు మరదలు చంద్రకళకు ఫోన్ చేసి స్వాతి కనిపించడం లేదని చెప్పాడు. వీళ్లిద్దరు ఎప్పుడూ గొడవ పడుతుంటారనే అనుమానంతో అసలు ఏం జరిగిందో చూడాలని చంద్రకళ ఈవిషయాన్ని దిల్‌సుఖ్‌నగర్లో ఉంటున్న తన మేనమామ గోవర్ధన్‌రెడ్డికి చెప్పింది. మహేందర్‌రెడ్డికి ఇంటికి ఆయన వెళ్లగా అతనికి కూడా తన భార్య స్వాతి కనిపించడం లేదని చెప్పాడు. దీంతో ఇద్దరూ కలిసి శనివారం రాత్రి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.



బోడుప్పల్ బాలాజీహిల్స్ మేడిపల్లి పీఎస్ పరిధిలోకి వస్తుందని ఉప్పల్ పోలీసులు అక్కడికి పంపించారు. ఫిర్యాదు తీసుకునే క్రమంలో మేడిపల్లి పోలీసులు మహేందర్‌రెడ్డిని పలు మార్లు ప్రశ్నించడంతో.. భార్య స్వాతిని చంపింది తానేని నేరం అంగీకరించాడు.

*** కులాంతర వివాహంతో మనస్పర్థలు..**

వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫోరెన్సిక్ నిపుణులు, క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. ఇవాళ ఉదయం మహేందర్‌రెడ్డి ఇంటికి పోలీసులు వెళ్లి చూసే సరికి కేవలం మొండెం మాత్రమే మిగిలింది. మొండేనికి డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిందితుడు పోలీసుల అదుపులోనే ఉన్నాడని, కేసుకు సంబంధించిన సాంకేతిక ఆధారాలన్నీ పకడ్బందీగా సేకరించిన తర్వాత ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని డీసీపీ తెలిపారు. ''జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో మహిళ శరీర భాగాల కోసం మూసీ నదిలో గాలిస్తున్నాం. కానీ, ఇప్పటి వరకు దొరకలేదు. స్వాతి, మహేందర్‌రెడ్డికి ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన రెండు నెలల నుంచే వీరిద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. అప్పుడు కామారెడ్డిగూడలోనే ఉన్నారు. అక్కడ 498(ఎ) కేసు నమోదైంది. తర్వాత పోలీసులు కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. పెద్దల సమక్షంలో రాజీపడ్డారు. ఇంటర్ చదివిన మహేందర్‌రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్వాతి కాల్ సెంటర్‌లో జాబ్ చేస్తోంది. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో నిందితుడు మహేందర్‌రెడ్డి ఒక్కడేనని తేలింది. స్వాతి హత్య క్షణికావేశంలో జరిగింది కాదు.. గతంలో నాలుగు సార్లు గొడవపడ్డారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో ఇరు కుటుంబాలకు చెందిన వారి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. దీంతో మహేందర్‌రెడ్డికి అతడి కుటుంబ సభ్యులు ఎవరూ సహకరించలేదు. మేం బాగానే ఉన్నాం..భోజనం చేశామని నిన్న రాత్రి కూడా స్వాతి ఫోన్ నుంచి ఆమె తల్లికి మెసేజ్ పంపాడు. 23వ తేదీ ఉదయం ఇద్దరి మధ్య ఏవిషయంలో గొడవ జరిగిందనేదానిపై ఆరా తీస్తున్నాం. పెళ్లయిన ఏడాదిన్నరలోనే నాలుగు సార్లు కౌన్సెలింగ్‌కు వెళ్లారు'' అని డీసీపీ వివరించారు.

## తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి

**: కేటీఆర్**

హైదరాబాద్: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహానికి భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సామాన్యుడి నుంచి అసాధారణ నేతగా ఎదిగారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు సీపీఐ మద్దతులో సురవరం పాత్ర మరువలేనిదన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి




భౌతిక కాయానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాళులర్పించారు. ఆయ మరణం రాజకీయాలకు తీరని లోటు అని పేర్కొన్నారు.

*** రాజకీయాల్లో కీలకమైన వ్యక్తిని కోల్పోవడం బాధాకరం: గుత్తా సుఖేందర్‌రెడ్డి**

సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళులర్పించారు. రాజకీయాల్లో కీలకమైన వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. పార్టీని, భావజాలాన్ని ఎన్నడూ వీడని వ్యక్తి సురవరం అని కొనియాడారు. సురవరం భౌతిక కాయానికి కోదండరామ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జయప్రకాష్ నారాయణ నివాళులర్పించారు.

## 11 ఏళ్లుగా లేనిది ఇప్పుడేందుకు: కిషన్‌రెడ్డికి మంత్రి తుమ్మల సూటి ప్రశ్న

రాష్ట్రంలో యూరియా కొరతపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చూస్తే వాస్తవాలు దాచి రాష్ట్ర ప్రభుత్వం పై ఎదురుదాడి చేసినట్లు ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ కేంద్ర మంత్రి గా ఉన్న కిషన్ రెడ్డికి యూరియా సరఫరా లో జియో పాలిటిక్స్ రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఎర్ర సముద్రంలో నౌకాయనం నిలవడంతో యూరియా ఇంపోర్ట్ డిమాండ్ కు తగ్గ స్థాయిలో లేదని ఓ పక్క చెబుతూనే మరోపక్క యూరియా పక్కదారి పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ఆరోపణలు చేయడం వారి ద్వంద వైఖరికి నిదర్శనంగా నిలుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా దిగుమతులు లేక దేశీయంగా ఉత్పత్తి డిమాండ్ కు తగ్గ స్థాయిలో లేక నెలకొన్న కొరతపై వాస్తవాలు దాచి ,కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా యూరియా కొరత నెలకొంటే రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేలా వ్యాఖ్యలు చేయడం వారి స్థాయికి తగినట్లు లేదని హితవు పలికారు. రాష్ట్ర ప్రజానీకం ఆయన ఓట్లు వేసి గెలిపిస్తే కేంద్ర మంత్రి అయ్యారనే సంగతి మరిచిపోవద్దన్నారు. తెలంగాణ రైతాంగం యూరియా కష్టాలు తీరేలా కేంద్ర మంత్రిగా చొరవ తీసుకుని యూరియా సరఫరా చేయించాలని అదనంగా యూరియా సరఫరా చేస్తే రైతాంగం పక్షాన కృతజ్ఞతలు తెలుపుతామన్నారు. అలా చేయకుండా కేంద్ర ప్రభుత్వం అలసత్వంతో ఏర్పడిన యూరియా కొరతపై వాస్తవాలు దాచి రాజకీయ ఆరోపణలు చేయడం తగదని ప్రశ్నించారు. యూరియా కొరతపై మంత్రులు పదే పదే చెప్పడంతో రైతులు ముందే కొనుక్కునే ప్రయత్నం చేస్తున్నారన్న కిషన్ రెడ్డి వ్యాఖ్యలు బురద జల్లేలా ఉన్నాయని,యూరియా సరఫరాలో జాప్యం ఇంపోర్ట్ లేకపోవడం దేశీయంగా ఉత్పత్తి లేకపోవడంతో వాస్తవాలు రైతాంగంకు వివరిస్తుంటే మంత్రులపై అభాండాలు వేయడం తీవ్రంగా ఆక్షేపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇది మూడో పంటకాలమని గత ఏడాదిన్నర కాలంలో యూరియా కోసం రైతులు ఎప్పుడు ఆందోళన చెందలేదని గుర్తు చేశారు. ఈ దఫా ఎందుకు ఆందోళనకు కారణం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయక పోవడంతోనని, వాస్తవాలు దాచి రాజకీయ ఆరోపణలు చేయడం తగదని సూచించారు.

*** ఇప్పటివరకు 5.66 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా :**

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఈ వానాకాలం



సాగుకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపులు చేసిందన్నారు ఆగస్ట్ 31 నాటికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలి కానీ ఇప్పటివరకు 5.66 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా జరిగిందన్నారు. ఇంకా 2.64 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా కాలేదని దీంతో కొరత నెలకొంది. ఆగస్ట్ లో వినియోగం ఎక్కువగా ఉండటంతో రైతులు ఆందోళనగా ఉన్నారు. కిషన్ రెడ్డి ఈ వాస్తవాలపై సమాధానం చెప్పాలని నిలదీశారు. కేంద్రం యూరియా సరఫరా లో వైఫల్యం చెందితే ఆ నెపం ఒప్పుకోకుండా వాస్తవాలు దాచి రాష్ట్ర ప్రభుత్వం పై రాజకీయ ఆరోపణలు చేయడం ఆయన పరపతి తగ్గేలా ఉందన్నారు. కేంద్ర మంత్రి హోదాలో బాధ్యతగా వారు ప్రకటించిన 50 వేల టన్నుల యూరియా తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని కోరారు.

# దిల్లీ సీఎంపై దాడి.. వెలుగులోకి పలు భద్రతా లోపాలు!

దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా సివిల్ లైన్స్‌లోని తన అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఆమెపై దాడి జరగడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన అధికారులు రాజ్ నివాస్ మార్గ్‌లోని ఆమె అధికారిక నివాసంలో భద్రతా లోపాలను గుర్తించారు. నిందితుడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన ఆటో డ్రైవర్ సకారియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీభాయ్(41)గా గుర్తించి ఇదివరకే అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారణ జరిపిన అధికారులు.. లోపాల కారణంగా 'పెను ప్రమాదం' సంభవించే అవకాశాన్ని ప్రస్తావించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హోం మంత్రిత్వ శాఖకు నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ దాడి తర్వాత సీఎం రేఖా గుప్తాకు కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది. ఇందులో 20-22 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ఆమెకు భద్రతకు కల్పిస్తారని అధికారులు 'ఈటీవీ భారత్'కు తెలిపారు. నిరంతరం ఆమెకు రక్షణ కల్పించడానికి అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు.

*** కాంప్లెక్స్‌లోకి వెళ్లడానికి, రావడానికీ ఒక్కటే గేటు**

రెండు నెలల కిందట, సీఎం రేఖాగుప్తాకు 1/8, 2/8 రాజ్ నివాస్ మార్గ్‌లో రెండు బంగ్లాలు



కేటాయించారు. అందులో ఆమె ఒకదాన్ని తన నివాసంగా, మరొకటి క్యాంప్ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. ఈ కాంప్లెక్స్‌లో మరో రెండు బంగ్లాలు కూడా ఉన్నాయి. వాటిని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి రవి ఇంద్రరాజ్ సింగ్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్‌లకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. నాలుగు బంగ్లాలకు ప్రవేశించడానికి, బయటకు వెళ్లేందుకు మార్గం ఒక్కటే ఉండటం ప్రధాన భద్రతా లోపం అని అధికార వర్గాలు పేర్కొన్నాయి. నివేదికలో వెలుగులోకి వచ్చిన మరో లోపం ఏమిటంటే.. సిబ్బంది, అక్కడికి వచ్చే సందర్శకులు ఒకే మార్గాన్ని ఉపయోగించడం. దీంతో ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించడం కష్టంగా మారిందని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. భాజపా ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ గోయల్ దీనిపై స్పందించారు. నిర్మాణ సంబంధిత సమస్యలను కూడా ఎత్తి చూపారు. కాంప్లెక్స్ ప్రహరీ గోడ ఎత్తు చాలా తక్కువగా ఉందన్నారు. ఎవరైనా సులభంగా లోపలికి దూకే విధంగా ఉందని తెలిపారు. "కాంప్లెక్స్‌కు మూడు వైపులా ప్రైవేట్ అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. భద్రతా సిబ్బంది నిరంతరం నిఘా నిర్వహించడం కష్టతరంగా మారింది'' అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నివాసం చుట్టుపక్కల ఉన్న సీసీటీవీ కెమెరాలను కూడా అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్ని రాష్ట్రల మాదిరిగా దిల్లీ ముఖ్యమంత్రికి శాశ్వత నివాసం లేదన్నారు. రేఖా గుప్తా బంగ్లా టైప్ 7 అని, సాధారణంగా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేటాయించే టైప్ 8 ఇళ్ల కంటే కాస్త చిన్నదిగానే ఉంటుందని అధికారులు తెలిపారు.

## రాహుల్‌కు బిహార్ ఓటమి భయం పట్టుకుంది : అనురాగ్ ఠాకూర్




ఓట్ల చోరీ ఆరోపణలను భాజపా నేత అనురాగ్ ఠాకూర్ ఖండించారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ఇప్పటికే దాదాపు 90 ఎన్నికల్లో పరాజయం పాలయ్యిందని ఎద్దేవా చేశారు. రానున్న బిహార్ ఎన్నికల్లోనూ ఓడిపోతామన్న భయం ఆయన్ను వెంటాడుతోందన్నారు. "ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారి రాహుల్ గాంధీ ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను నిందిస్తుంటారు. ఈసారి పోలింగ్‌కు ముందే.. ఎన్నికల సంఘంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. దేశ రాజ్యాంగ వ్యవస్థపై ప్రతిపక్ష నేతలు విశ్వాసం కోల్పోవడం దురదృష్టకరం'' అని హిమాచల్‌ప్రదేశ్ హమీర్‌పుర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలను బలోపేతం చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందని ఠాకూర్ పేర్కొన్నారు. అవినీతి నేతలపై కఠిన చట్టాలను తీసుకురావడానికి ప్రధాని మోదీ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో దిల్లీలో కొంతమంది మంత్రులు జైలు నుంచే నిర్ణయాలు తీసుకున్నారని, ఫైళ్లపై సంతకాలు చేశారంటూ.. ఆప్ నేతలను ఉద్దేశించి విమర్శలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ఇటువంటి తీరు మంచిది కాదన్నారు.

## 'ఆ సూచన నాకూ వర్తిస్తుంది'.. పెళ్లిపై రాహుల్ గాంధీ సరదా వ్యాఖ్యలు

తన పెళ్లి విషయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సరదా వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్‌తో మాటామంతీ కొనసాగుతోందని తెలిపారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా బిహార్‌లోని అరారియాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, రాహుల్ గాంధీ మధ్య ఈమేరకు సంభాషణ సాగింది. సమావేశంలో భాగంగా తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నేత చిరాగ్ పాసవాన్ ఇక పెళ్లి చేసుకోవాలంటూ సూచించారు. ఈ క్రమంలోనే



పక్కనే కూర్చున్న రాహుల్ గాంధీ వెంటనే మైక్ అందుకుని.. 'ఈ సూచన నాకూ వర్తిస్తుంది.' అని వ్యాఖ్యానించారు. 'ఇదే విషయాన్ని మా నాన్న ఎప్పటినుంచో చెబుతున్నారు కదా' అని తేజస్వీ బదులిచ్చారు. 'అవును. దీనిపై ఆయనతో చర్చలు కొనసాగుతున్నాయి' అని రాహుల్ బదులిచ్చారు. ఈ సరదా సంభాషణతో అక్కడ నవ్వులు విరబూశాయి. రాహుల్ గాంధీ పెళ్లిపై రెండేళ్ల క్రితం పట్నాలో లాలూప్రసాద్ యాదవ్ తనదైన శైలిలో నవ్వులు పూయించిన సంగతి తెలిసిందే. "మా మాట విను.. పెళ్లి చేసుకో. మేమంతా నీ బరాత్‌కు రావాలనుకుంటున్నాం. వివాహానికి విముఖత చూపుతుండటంతో మీ అమ్మ (సోనియా గాంధీ) ఆందోళన చెందుతోంది'' అని వ్యాఖ్యానించారు. తాజా సమావేశంలో ఇదే విషయాన్ని రాహుల్ ప్రస్తావనకు తీసుకొచ్చినట్లు సమాచారం.

## ఓనం పండుగకి... మోనాలిసా ఆహ్వానిస్తే!

మలయాళీలకు ఓనం అనేది ఓ ప్రత్యేక పండుగ. మహాబలి చక్రవర్తి ఆ రోజుల్లో తిరిగి తన రాజ్యానికి వస్తాడని నమ్మకం. ఈ వేడుక మరికొద్ది రోజుల్లో ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో కేరళ టూరిజం సోషల్ మీడియా హ్యాండిల్స్‌పై వినూత్నంగా మోనాలిసా ఫొటోతో ప్రచారం నిర్వహిస్తోన్నారు. కేరళ సంప్రదాయంలో మోనాలిసా.. ఆఫ్ వైట్ కసావు చీరను ధరించి, నుదుటన బొట్టు పెట్టి, సిగలో మల్లె పువ్వులను పెట్టుకున్న ఐకానిక్ లేడీగా ఉన్న ఆ ఏఐ ఫొటోతో 'కేరళ టూరిజం టైమ్‌లెస్. గ్రేస్‌ఫుల్ ఐకానిక్' అనే పేరుతో ఓనం ప్రమోషన్లలో భాగంలో ఈ ప్రచారాన్ని సోషల్ మీడియాలో నిర్వహిస్తోంది. ఈ ఓనం ఉత్సవాలు నెల 26 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 5న తిరుఓనంతో ముగుస్తాయి. ఇది పంటకోత సమయంలో అత్యంత ముఖ్యమైన రోజుగా భావిస్తారు. కృత్రిమ మేధతో మోనాలిసాని రూపొందించిన ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది. మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్‌లో షేర్ చేస్తున్నారు. ఓనం పండుగ ప్రచారాన్ని వినూత్నంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మోనాలిసా చిత్రంతో నిర్వహించడంపై పలువురు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఇక చరిత్రలో చూసుకుంటే 1911, ఆగస్టు 21 సమయంలో ఈ మోనాలిసా చిత్రం పారిస్‌లోని మ్యూజియం నుంచి ఎత్తుకెళ్లిన సంఘటన గుర్తుకు చేస్తుంది. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ పెయింటింగ్ మళ్లీ అదే మ్యూజియానికి చేరుకుంది. డిజిటల్ ఔట్రీచ్‌తో సహా నూతన



మార్కెటింగ్ విధానాలతో పర్యటకంలో దూసుకెళ్తోంది. ఓనం పండుగ సందర్భంగా సందర్శకులకు మోనాలిసా ఆహ్వానం ఆనందాన్ని కలిగిస్తుందని కేరళ టూరిజం ఆశిస్తోంది.

## చట్టసభలు.. ప్రజా సమస్యలపై చర్చించడానికే గానీ.. రాజకీయ లబ్ధికి కాదు: అమిత్ షా



దిల్లీ: చట్ట సభలు.. ప్రజాసమస్యలపై చర్చలు జరపడానికే గానీ.. రాజకీయ లబ్ధి పొందేలా వ్యవహరించడానికి కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దిల్లీలో జరుగుతున్న 'ఆల్ ఇండియా స్పీకర్స్ సమావేశం'లో కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలు దేశాభివృద్ధిని ప్రభావితం చేస్తాయని చెప్పారు. "చర్చలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. దీని గురించి ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలి. అర్థవంతమైన చర్చలు జరగాలి. సభా గౌరవాన్ని, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రజాసమస్యలపై నిష్పాక్షపాతమైన చర్చలు జరపడానికి చట్ట సభలను వేదికగా మార్చుకోవాలి. వాటి నిబంధనల మేరకు సమావేశాలు జరిగేలా చూడాలి''అని అన్నారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలి భారతీయ స్పీకర్‌గా పనిచేసిన విఠల్‌భాయ్ పటేల్‌కు కేంద్రమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. వందేళ్ల క్రితం స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికతోనే దేశంలో పార్లమెంటరీ చరిత్ర మొదలైందన్నారు. అప్పటి బ్రిటిష్ పాలనలో 1919 డిసెంబర్ 24న దేశంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఏర్పాటైంది. 1925లో విఠల్‌భాయ్ పటేల్ ఈ సభకు స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

## బిహార్ ఎన్నికలు.. ఓటర్ల జాబితాలో ఇద్దరు పాకిస్థానీలు

పట్నా: దేశ రాజకీయాల్లో ప్రస్తుతం బిహార్ ఎన్నికలు చర్చనీయాంశంగా మారాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ ఆరోపిస్తుండగా.. అంతా సవ్యంగానే ఉందని ఎన్నికల సంఘం చెబుతూవస్తోంది. అయితే, తాజాగా బిహార్‌లో ఇద్దరు పాకిస్థానీ మహిళలకు ఓటరు కార్డు జారీ కావడంతో కేంద్ర హోంశాఖ చర్యలకు ఉపక్రమించింది. వారి పేర్లను వెంటనే తొలగించాలని యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఇమ్రానా ఖానమ్ అలియాస్



ఇమ్రానా ఖాటూన్, ఫిర్దోషియా ఖానమ్ అనే ఇద్దరు మహిళలకు ఇటీవల ఓటరు కార్డులు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర హోంశాఖ విచారణ చేపట్టింది. ఫిర్దోషియా 1956లో మూడు నెలల వీసాపై, ఇమ్రానా మూడేళ్ల వీసాపై భారత్‌కు వచ్చి.. భాగల్పూర్ జిల్లాలోని భికన్‌పూర్‌లో స్థిరపడ్డారు. వీరికి ఓటర్ కార్డులు ఉండటాన్ని గుర్తించిన కేంద్రం విచారణ జరపాలని, ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో విచారణ ప్రారంభించినట్లు కలెక్టర్ డాక్టర్ నావల్ కిశోర్ చౌదరీ చెప్పారు. ఆ ఇద్దరు మహిళలకు నోటీసులు పంపనున్నట్లు వెల్లడించారు.

## డీకే శివకుమార్ బాటలో మరో ఎమ్మెల్యే.. ఆరెస్సెస్ గీతాలపన



బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీలో ఇటీవల డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరెస్సెస్ గీతాన్ని ఆలపించి చర్చకు తెరలేపారు. తాజాగా ఆయన బాటలోనే మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రంగనాథ్ ఆరెస్సెస్ గీతాలపన చేశారు. అంతేకాదు.. ఆ గీతాన్ని ఆలపించడంలో తప్పేముందని వ్యాఖ్యానించారు. తుమకూరు జిల్లా కునిగల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రంగనాథ్ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన ఆరెస్సెస్ గీతం 'నమస్తే సదా వత్సల'ను ఆలపించారు. 'ఈ గీతం చాలా బాగుంది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అసెంబ్లీలో ఆలపించిన తర్వాత నేనూ విన్నాను. దాని అర్థం కూడా తెలుసుకున్నాను. జన్మభూమికి వందనం చేయాలి అనే అర్థముంది. అందులో నాకేమి తప్పుగా అనిపించలేదు. కాంగ్రెస్.. లౌకిక పార్టీ. మేం ఇతరుల నుంచి మంచిని స్వీకరిస్తాం. ఆరెస్సెస్ గీతాన్ని ఆలపించడంలో తప్పేముంది?''అని అన్నారు. కులాలు, మతాల పేరుతో భాజపా రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే రంగనాథ్ విమర్శించారు. వాటిని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మా సిద్ధాంతాలు, వారి సిద్ధాంతాలు ఎప్పటికీ కలవలేన్నారు.

## ఆ ఓటర్లలో 98శాతం మంది పత్రాలు అందాయి

బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా కొత్తగా నమోదు చేసుకున్నవారిలో 98.2 శాతం మంది నుంచి ధ్రువీకరణ పత్రాలు ఇప్పటికే అందాయని ఎన్నికల కమిషన్ ఆదివారం వెల్లడించింది. తాజాగా పబ్లిష్ చేసిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తెలియజేసేందుకు మరో ఎనిమిది రోజుల గడువు ఉంది. ముసాయిదా జాబితాలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి ఓటర్లకు ఇదే చివరి అవకాశమని ఈసీ వెల్లడించింది. ఓటర్లు ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇచ్చిన సమయంలో సమర్పించని పత్రాలను ఇప్పుడు సబ్మిట్ చేయవచ్చని వెల్లడించింది. "బిహార్ సీఈవో ఇచ్చిన సమాచారం ప్రకారం ఇప్పటి వరకు 98.2 మంది పత్రాలు అందాయి'' అని ఈసీ పేర్కొంది. జూన్ 24 నుంచి ఆగస్టు 24లోపు ఇవి ఈసీకి చేరాయి. సగటున రోజుకు 1.64శాతం మంది సమర్పించినట్లైంది. సెప్టెంబర్ 1వ తేదీ వరకు సమయం ఉందని వెల్లడించింది.

**ఎన్‌డీఏ ఓట్ల దోపిడీ జరగనీయం..**

మరోవైపు బిహార్‌లో ఓటర్ అధికార్ యాత్రలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అరారియా ప్రాంతంలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ.. ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పేరిట ఎన్‌డీఏ ప్రభుత్వం ఓట్లను తస్కరించడాన్ని తాము చూస్తూ ఊరుకోబోమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందని పేర్కొన్నారు. ఆర్జేడీ




నేత తేజస్వీ యాదవ్‌తో కలిసి రాహుల్ గాంధీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.



## ఉక్రెయిన్‌కు మరో 3,350 క్షిపణులు పంపనున్న అమెరికా

వాషింగ్టన్: ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరో 3,350లకు పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ క్షిపణులను ఆ దేశానికి అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆయుధ ప్యాకేజీకి యూరోపియన్ దేశాలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపాయి. దాదాపు ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయని సమాచారం. అయితే 240 నుంచి 450 కి.మీ పరిధి కలిగిన ఈఆర్ఏఎమ్ క్షిపణులను రష్యాపైకి ప్రయోగించాలంటే ఉక్రెయిన్ పెంటగాన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు రష్యా భూభాగంలోని లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా రూపొందించిన లాంగ్‌రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్ను వినియోగించకుండా పెంటగాన్ అడ్డుకుంటున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. మాస్కో చేపడుతున్న దాడులకు దీటుగా ఆయుధాలను ఉపయోగించకుండా కీవ్ సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పేర్కొన్నాయి. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇరుదేశాల నేతలు ముందడుగు వేస్తుండకపోవడంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు సహాయంగా అగ్రరాజ్యం పలుమార్లు పెద్ద మొత్తంలో ఆయుధ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌కు 32.2 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, అత్యాధునిక క్షిపణులు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది

## మొరాయించిన ఎయిర్‌టెల్ సేవలు..

### కంపెనీపై యూజర్ల ఆగ్రహం..!




**హైదరాబాద్:** భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ మరోసారి మొరాయించింది. ఈ సారి బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ సహా పలు కీలక నగరాల్లో ప్రభావం కనిపించింది. ఈ నెల 8న ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్ నిలిచిపోయిన విషయం తెలిసిందే. దాంతో కాల్స్, ఎస్ఎంఎస్, ఇంటర్‌నెట్ సేవలు స్తంభించాయి. డౌన్‌డెటెక్టర్ నుంచి వచ్చిన డేటా ప్రకారం.. మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో ఫిర్యాదులు వచ్చాయి. 7,100 మందికి పైగా వినియోగదారులు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ కస్టమర్ సపోర్ట్ హ్యాండిల్ ఎయిర్‌టెల్ కేర్స్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. 'తాత్కాలిక కనెక్టివిటీ సమస్య'గా పేర్కొంది. సమస్యను గంటలోగా పరిష్కారమవుతుందని పేర్కొంది.

యూజర్లు తమ మొబైల్స్‌ను రీ స్టార్ట్ చేయాలని కంపెనీ సూచించింది. ఎయిర్ ట్వీట్‌లో 'ఈ అసౌకర్యానికి మమ్మల్ని క్షమించండి. ఈ సమస్య తాత్కాలిక కనెక్టివిటీ అంతరాయం కారణంగా జరుగుతుంది. దాదాపు ఒక గంటలో పరిష్కారమవుతుంది. మీ మొబైల్‌ను ఒకసారి రీస్టార్ట్ చేయండి' అని పేర్కొంది. నెట్‌వర్క్‌లో అంతరాయంపై సోషల్ మీడియా వేదికగా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ రోజు బెంగళూరులో ఎయిర్‌టెల్ ఇంటర్‌నెట్ నిలిచిపోయింది. కంపెనీ వినియోగదారులకు ముందుగానే తెలియజేయకూడదా?' అంటూ ఓ యూజర్ ప్రశ్నించాడు. మరొక యూజర్ 'గత 6 గంటలుగా ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ సేవలు నిలిచిపోయాయి. కాల్స్ రావడం లేదు. ఇంటర్నెట్ కూడా స్తంభించింది. కస్టమర్ కేర్ నుంచి కూడా స్పందన లేదు. దీనిపై ట్రాయ్ చర్య తీసుకోవాలి' అంటూ డిమాండ్ చేశాడు.

## అనిల్ అంబానీకి పెరుగుతున్న కష్టాలు..!

### ఫ్రాడ్‌గా ప్రకటించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా..!




**న్యూఢిల్లీ:** పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి కష్టాలు పెరుగుతున్నాయి. దివాళా తీసిన రియలన్స్ కమ్యూనికేషన్ అకౌంట్లను ఎస్‌బీఐ బ్యాంక్ ఫ్రాడ్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం కంపెనీ అకౌంట్స్ మోసపూరితమని ప్రకటించింది. ఇందులో మాజీ డైరెక్టర్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు సైతం ఈ కేసులో చేర్చింది. రెగ్యులేటరీ ఫైలింగ్స్ ప్రకారం.. బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఈ రుణ ఖాతాను మోసపూరితంగా ప్రకటించింది. 2016లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించింది. ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆగస్టు 2016లో రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు మూలధనం, నిర్వహణ వ్యయాన్ని అవసరాలను తీర్చడానికి రూ.700 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ఆర్‌కామ్, రిలయన్స్ టెలికామ్, అంబానీ అకౌంట్లను ఫ్రాడ్ అకౌంట్లుగా నిర్ధారించింది. మంజూరు చేసిన రుణాలను ఇతర మార్గాలకు మళ్లించడం, నిబంధనలు పాటించలేదని పేర్కొంది.

ఈ కంపెనీతో సంబంధాలు ఉన్న కొంత మందికి నోటీసులు పంపించినట్లు చెప్పింది. ఈ మేరకు ఆగస్టు 22, 2025 రోజున ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో రిలయన్స్ కమ్యూనికేషన్స్ వెల్లడించింది. ఆగస్టు 8వ తేదీన తమకు నోటీసులు అందినట్లు తెలిపింది. నోటీసుల ప్రకారం.. రూ.724.78 కోట్ల రుణాలకు సంబంధించి రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ లోన్ అకౌంట్లు, అనిల్ ధీరూభాయ్ అంబానీ, మంజారి ఆశిష్ కాకెర్‌లను ఫ్రాడ్‌గా పేర్కొంది. 2017, జూన్ 30 నాటికే నిరర్థక ఆస్తులుగా నిర్ణయం తీసుకున్నారని.. ఈ విషయంపై రుణ గ్రహీతలు, గ్యారెంటీ ఇచ్చిన వారికి సమాచారం అందిస్తూ వచ్చామని.. అయినప్పటికీ ఆ విషయాన్ని వారు పట్టించుకోలేదని పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో ఎస్‌బీఐ సైతం అకౌంట్లను మోసపూరితమని ప్రకటించిన విషయం తెలిసిందే. రుణాల నిబంధనలు ఉల్లంఘించడం ద్వారా బ్యాంకు నిధులను దుర్వినియోగం చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి.

ఎస్‌బీఐ ఫిర్యాదు మేరకు సీబీఐ శనివారం రిలయన్స్ కమ్యూనికేషన్, అంబానీ నివాసానికి సంబంధించిన ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. ఆసియాలోనే ధనవంతుడైన ముకేశ్ అంబానీ తమ్ముడైన అనిల్ అంబానీపై ఎస్‌బీఐని మోసం చేశారన్న ఫిర్యాదు అందిందని పేర్కొంది. అనిల్ అంబానీ ప్రతినిధి వివరణ ఆరోపణలను ఖండించారు. ఎస్‌బీఐ దాఖలు చేసిన ఫిర్యాదు పది సంవత్సరాల కంటే పాత విషయాలకు సంబంధించిందని.. ఆ సమయంలో అంబానీ కంపెనీకి నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారని.. కంపెనీ రోజువారీ నిర్వహణలో ఎలాంటి పాత్రలేదని పేర్కొన్నారు. అయితే, రిలయన్స్ కమ్యూనికేషన్స్ కంపెనీకి ఎస్‌బీఐ రూ. 2,227.64 కోట్లు రుణాలు ఇచ్చింది. 2016 ఆగస్టు 26 నుంచి వడ్డీ, ఖర్చులు అదనం కాగా.. రూ.786.52 కోట్ల బ్యాంక్ గ్యారెంటీ సైతం ఉన్నది. ఈ క్రమంలో ఆ కంపెనీని, ప్రమోటర్ అనిల్ అంబానీ అకౌంట్లను ఫ్రాడ్‌గా ఎస్‌బీఐ ప్రకటించింది.

## స్థిరంగా బంగారం ధరలు..



**న్యూఢిల్లీ:** పెళ్లీల సీజన్, పండుగలు కూడా రానుండటంతో చాలా మంది ఇప్పటి నుంచే తమకు కావాల్సిన బంగారు ఆభరణాలు చేయించుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. కానీ ఈ మధ్య బంగారం ధరలు అనేవి విపరీతంగా పెరుగుతూ అందరికీ షాకిస్తున్నాయి. అయితే ఆగస్టు 24న బంగారం ధరలు ఎలాంటి మార్పులేదు. గోల్డ్ రేట్స్ నేడు స్థిరంగా ఉన్నాయి. ఆగస్టు 24 ఆదివారం రోజున 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,01,620 గా ఉంది. అదే విధంగా 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 93,150 గా ఉంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,150 వద్ద ఉంది. విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,150 వద్ద ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,150 వద్ద ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.93,150 వద్ద ఉంది. మరో వైపు నేడు వెండి ధరలు కూడా స్థిరంగా ఉన్నాయి. మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.1,30,000గా ఉంది. ఈరోజు ఆది వారం బంగారం, వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు పుజారా గుడ్‌బై..



**న్యూఢిల్లీ:** భారత జట్టు సీనియర్ బ్యాట్స్‌మెన్ ఛతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్‌కు ఆదివారం వీడ్కోలు ప్రకటించాడు. సోషల్ మీడియా వేదికగా క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు వెల్లడించాడు. భారత జెర్సీ ధరించడం, జాతీయ గీతం పాడడం, ప్రతిసారీ మైదానంలో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం తనకు ఎంత ప్రత్యేకమైనదో మాటల్లో చెప్పలేనని.. కానీ ప్రతిదానికి ముగింపు ఉంటుందని.. భారత క్రికెట్ నుండి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో పుజారా కామెంటేటర్‌గా కనిపించిన విషయం తెలిసిందే. ఇక పుజారా చివరిసారిగా జూన్ 2023లో ఇంగ్లండ్‌లోనే చివరి టెస్ట్ ఆడాడు. ఓవల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023 ఫైనల్ మ్యాచ్ ఆఖరిది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా భారత జట్టును ఓడించింది. పుజారా తన అంతర్జాతీయ కెరీర్‌లో 103 టెస్టులు, ఐదు వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 176 ఇన్నింగ్స్‌లలో 43.61 సగటుతో 7,195 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అత్యుత్తమ స్కోరు 206 పరుగులు కాగా.. వన్డేల్లో అతను 39.24 సగటుతో 51 పరుగులు చేశాడు. పుజారా ఐపీఎల్‌లో 30 మ్యాచ్‌లు ఆడాడు. 22 ఇన్నింగ్స్‌లలో అతను 99.75 స్ట్రయిక్ రేట్‌తో 390 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ కూడా ఉంది. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన పుజారాకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. టీమ్ ఇండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ తుఫాను వచ్చినప్పుడు అండగా నిలిచాడని.. ఆశలు సన్నగిన్నలుతున్నప్పుడు పోరాడాడని గంభీర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా బొగ్లే స్పందిస్తూ.. భారత క్రికెట్‌కు పుజారా చిహ్నంగా నిలుస్తాడని పేర్కొన్నారు. అతనో పోరాట యోధుడని.. గౌరవప్రదమైన క్రికెట్ ఆడాడని పేర్కొన్నారు. మైదానంలో ప్రతిసారీ భారత్ కోసం తనవంతు కషి చేశాడని.. భారత అభిమానులు ఈ రోజు ఎక్కడ ఉన్న లేచి నిలబడి చప్పట్లు కొడుతారని పేర్కొన్నారు. మాజీ క్రికెటర్ వసీం జాఫర్ మాట్లాడుతూ భారత క్యాప్ ధరించి సాధించిన దానికి చాలా గర్వపడాలని.. భవిష్యత్ బాగుండాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. పుజారా రిటైర్మెంట్‌పై బీసీసీఐ సైతం స్పందించింది. భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడని పేర్కొంది.

## పటిష్టమైన జట్టును ప్రకటించిన అఫ్ఘానిస్థాన్..

### కెప్టెన్‌గా రషీద్ ఖాన్!

### ఆసియా కప్ 2025 కోసం 17 మందితో అఫ్ఘాన్ జట్టు ప్రకటన

### గతేడాది టీ20 ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్ చేరిన అఫ్ఘాన్

### చరిత్రలో తొలిసారి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లను ఓడించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి

### సెప్టెంబర్ 9న హాంగ్‌కాంగ్‌తో తొలి మ్యాచ్

### గ్రూప్-ఏలో బంగ్లాదేశ్, శ్రీలంకతోనూ అఫ్ఘాన్ తలపడనుంది




**అఫ్ఘానిస్థాన్:** గతేడాది టీ20 ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచిన అఫ్ఘానిస్థాన్ జట్టు, ఇప్పుడు అదే ఆత్మవిశ్వాసంతో ఆసియా కప్ 2025 సమరానికి సిద్ధమైంది. ఈ మెగా టోర్నీ కోసం స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ సారథ్యంలో 17 మంది సభ్యులతో కూడిన పటిష్టమైన జట్టును అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. గత సంవత్సరం వెస్టిండీస్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో అఫ్ఘానిస్థాన్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఐసీసీ టోర్నీ చరిత్రలోనే తొలిసారి సెమీ ఫైనల్‌కు చేరి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆ టోర్నీలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి బలమైన జట్లను ఓడించి సంచలనం రేపింది. ఇప్పుడు అదే జోరుతో ఆసియా కప్‌లోనూ సత్తా చాటాలని పట్టుదలగా ఉంది.

సెప్టెంబర్ 9న అబుదాబి వేదికగా ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో హాంగ్‌కాంగ్‌తో అఫ్ఘనిస్థాన్ తలపడనుంది. అఫ్ఘాన్ జట్టు గ్రూప్-ఏలో ఉంది. ఇదే గ్రూప్‌లో బంగ్లాదేశ్, శ్రీలంక, హాంగ్‌కాంగ్ జట్లు కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 16న బంగ్లాదేశ్‌తో, 18న శ్రీలంకతో అఫ్ఘాన్ తన గ్రూప్ మ్యాచ్‌లను అబుదాబిలోనే ఆడనుంది.

**ఆసియా కప్‌కు అఫ్ఘానిస్థాన్ జట్టు**

రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, డార్విష్ రసూలీ, సెదిఖుల్లా అటల్, అజ్మతుల్లా ఒమర్జాయ్, కరీం జనత్, మహమ్మద్ నబీ, గుల్బదిన్ నైబ్, షరాఫుద్దీన్ అష్రఫ్, మహమ్మద్ ఇషాక్, ముజీబ్ ఉర్ రహ్మాన్, అల్లా ఘజన్‌ఫర్, నూర్ అహ్మద్, ఫరీద్ మాలిక్,

## శ్రేయస్ అయ్యర్ ఫ్యాన్స్‌కు డబుల్ గూస్‌బంప్స్..




**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 కోసం భారత జట్టును ప్రకటించారు. అయితే, ఈ జట్టులో అద్భుతమైన బ్యాట్స్‌మెన్ శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కలేదు. ఈ నిర్ణయం చూసి చాలామంది అభిమానులు ఆశ్చర్యపోయారు. శ్రేయస్ అయ్యర్‌కు టీమిండియాలో తప్పకుండా చోటు లభిస్తుందని అందరూ భావించారు కానీ అలా జరగలేదు. అయితే, జట్టును ప్రకటించిన తర్వాత కూడా శ్రేయస్ అయ్యర్‌కు స్క్వాడ్‌లో చేరే అవకాశం ఉంది. ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం.. శ్రేయస్ అయ్యర్‌తో పాటు యశస్వి జైస్వాల్, మహ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్లు కూడా జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఏసీసీ నిబంధనల ప్రకారం, ఒకవేళ ఏదైనా జట్టులోని ఏ ఆటగాడైనా గాయపడితే, లేదా జట్టు మేనేజ్‌మెంట్ మరొక ఆటగాడిని తీసుకోవాలని భావిస్తే, వారి స్థానంలో మరొక ఆటగాడిని తీసుకోవచ్చు. ఈ నియమం ప్రకారం.. స్టాండ్‌బై జాబితాలో ఉన్న ఆటగాళ్లను మాత్రమే తీసుకోవాలని లేదు. స్టాండ్‌బై జాబితాలో లేని ఆటగాళ్లకు కూడా జట్టులో చోటు లభించవచ్చు.

ఈ నిబంధనను బట్టి టోర్నమెంట్‌కు ముందు లేదా ఆసియా కప్ 2025 జరుగుతున్నప్పుడు భారత్ జట్టులోని ఏదైనా ఆటగాడు గాయపడితే, అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం దక్కవచ్చు.

టీ20 క్రికెట్‌లో శ్రేయస్ అయ్యర్ ప్రదర్శన ఎప్పుడూ అద్భుతంగా ఉంటుంది. అతను తన బ్యాటింగ్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో కూడా శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని కెప్టెన్సీలో జట్టు 2025 సీజన్ ఫైనల్‌కు చేరుకుంది. బ్యాటింగ్‌లోనూ అయ్యర్ తన సత్తా చూపించాడు. 17 మ్యాచ్‌లలో 50.33 సగటుతో 604 పరుగులు చేశాడు. ఇందులో ఆరు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని హయ్యెస్ట్ స్కోరు 97 నాటౌట్.

టీ20 క్రికెట్‌లో భారతదేశం తరపున అతను ఇప్పటివరకు 51 మ్యాచ్‌లు ఆడి, 30.66 సగటుతో 1104 పరుగులు చేశాడు. ఇందులో ఎనిమిది అర్ధ శతకాలు ఉన్నాయి, అతని అత్యధిక స్కోరు 74 నాటౌట్. ఓవరాల్‌గా 240 టీ20 మ్యాచ్‌లలో అయ్యర్ 34.08 సగటుతో 6578 పరుగులు చేశాడు. అతని అత్యధిక స్కోరు 147. ఈ ఫార్మాట్‌లో అతను మూడు సెంచరీలు, 43 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.

# దాదా సరికొత్త ఇన్నింగ్స్..!

### తొలిసారిగా హెడ్‌కోచ్ పాత్రలో సౌరవ్ గంగూలీ..!



**న్యూఢిల్లీ:** భారత జట్టు మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తొలిసారిగా సరికొత్త అవతారంలో కనిపించబోతున్నారు. తన కెరియర్‌లోనే కొత్ అధ్యాయాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు పరిపాలనపరమైన పాత్రల్లో కొనసాగిన గంగూలీ.. ఓ జట్టుగా హెడ్‌కోచ్‌గా పని చేయనున్నారు. దక్షిణాఫ్రికా టీ20 లీగ్ 2026 సీజన్ కోసం ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టు గంగూలీని హెడ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు పిట్రోరియా క్యాపిటల్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. డిసెంబర్ 26 నుంచి ప్రారంభమయ్యే 20 నాల్గవ సీజన్ కోసం భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ప్రిటోరియా క్యాపిటల్స్ ప్రధాన కోచ్‌గా నియామకమయ్యారని పేర్కొంది. మాజీ ఇంగ్లాండ్ క్రికెటర్ జోనాథన్ ట్రాట్ స్థానంలో గంగూలీ ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రొఫెషనల్ క్రికెట్ జట్టుకు హెడ్‌కోచ్‌గా గంగూలీ పూర్తి స్థాయి పాత్ర పోషించడం ఇదే మొదటిసారి. 53 ఏళ్ల గంగూలీ గత సంవత్సరం నుంచి ప్రిటోరియా క్యాపిటల్స్ మాతృ సంస్థ అయిన జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌కు క్రికెట్ డైరెక్టర్ పని చేసిన విషయం తెలిసిందే.

భారత మాజీ కెప్టెన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు క్రికెట్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ప్రిటోరియా క్యాపిటల్స్ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'యువరాజు మా క్యాంప్‌కు రాజసం తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు! సౌరవ్ గంగూలీని మా కొత్త హెడ్ కోచ్‌గా ప్రకటిస్తున్నందుకు చాలా సంతోషిస్తున్నాం' పేర్కొంది. వాస్తవానికి గంగూలీ 2008లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు. ఆ తర్వాత క్రికెట్ పరిపాలన రంగంలోనే ఎక్కువగా పని చేసేందుకు ఆసక్తి చూపించారు. బీసీసీఐ అధ్యక్షుడిగా, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతల్లో కొనసాగారు. ప్రస్తుతం ఐసీసీ పురుషుల క్రికెట్ కమిటీకి చైర్మన్‌గానూ కొనసాగుతున్నారు.

ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా, అలాగే ఒక దశలో మెంటార్‌గా వ్యవహరించారు. గత సీజన్ వరకు జొనాథన్ ట్రాట్ ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్‌కోచ్‌గా ఉన్నారు. గత సీజన్‌లో ఆ జట్టు పది గ్రూప్ మ్యాచ్‌లలో కేవలం రెండింట్లోనే విజయం సాధించింది. నాకౌట్ దశకు చేరుకోకపోవడంతో ట్రాట్ హెడ్‌కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలోనే గంగూలీ హెడ్‌కోచ్‌గా తీసుకోవడం విశేషం. సెప్టెంబర్ 9న జరిగే ఆటగాళ్ల వేలం జరుగనున్నది. జట్టును అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకు ఉత్తమమైన ఆటగాళ్లను ఎంపిక చేయాల్సిన బాధ్యత గంగూలీపైనే ఉండనున్నది. 2026 పురుషుల టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని దక్షిణాఫ్రికా టీ20 లీగ్ షెడ్యూల్‌ను ముందస్తుగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ లీగ్ డిసెంబర్ 26న మొదలై వచ్చే ఏడాది జనవరి 25 వరకు కొనసాగుతుంది. గంగూలీ నియామకం తమ అదృష్టంలో మార్పు తెస్తుందని ప్రిటోరియా క్యాపిటల్స్ ఆశిస్తోంది.




# అందువల్లే నేను నటిగా ఎదగగలిగాను: రెజీనా

కథ చెప్పే విధానానికి ఎప్పటికీ కాలం చెల్లదు అన్న రెజీనా
కళాకారులుగా ఎప్పటికప్పుడు కొత్తగా మారాలని వ్యాఖ్య
మధుర్ భండార్కర్ 'ది వైవ్స్' చిత్రంలో కీలక పాత్ర
బాలీవుడ్ స్టార్ హీరోల భార్యల జీవితాల వెనుక కథతో సినిమా
తమిళంలో 'మూకుత్తి అమ్మన్ 2' చేస్తున్నట్లు వెల్లడి

టాకీస్: గత 20 ఏళ్ల తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ ప్రముఖ నటి రెజీనా కసాండ్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇన్ని భాషల్లో విభిన్నమైన అవకాశాలు రావడం నా అదృష్టం. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎంతో సంతోషంగా ఉంది. మొదట్లో నాకు సరైన మార్గదర్శకులు ఎవరూ లేరు. ఎన్నో సందేహాలు, సవాళ్లు ఎదుర్కొన్నాను. కానీ, సొంతంగా ఒక్కో విషయం నేర్చుకున్నా. నటిగా అన్ని రకాల పాత్రలు చేయాలన్నదే నా కోరిక. నన్ను ఒకే రకమైన పాత్రలకు పరిమితం చేయకపోవడం వల్లే నటిగా ఎదగగలిగాను" అని రెజీనా వివరించారు. ఇక, కథ చెప్పే విధానం నిరంతరం అభివృద్ధి చెందే ఒక కళ అని, దానికి ఎప్పటికీ కాలం చెల్లదని ప్రముఖ నటి రెజీనా కసాండ్రా అభిప్రాయపడ్డారు. కాలానికి అనుగుణంగా రాణించాలంటే కళాకారులు తమను తాము నిరంతరం కొత్తగా ఆవిష్కరించుకోవడం ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. ప్రస్తుతం 'ది వైవ్స్' అనే హిందీ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న ఆమె, ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ తన కెరీర్, రాబోయే ప్రాజెక్టుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రముఖ దర్శకుడు మధుర్ భండార్కర్ తెరకెక్కిస్తున్న 'ది వైవ్స్' చిత్రంలో రెజీనా ఒక ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోల భార్యల జీవితాల్లోని గ్లామర్‌తో పాటు, వారి కష్టాలు, తెర వెనుక వాస్తవాలను ఆవిష్కరించే కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. ఇప్పటికే ఈ సినిమా మొదటి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. ఈ చిత్రంలో రెజీనాతో పాటు మౌనీ రాయ్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీమణులు కూడా నటిస్తున్నారు.

ప్రస్తుతం తాను చేస్తున్న ఇతర ప్రాజెక్టుల గురించి కూడా రెజీనా ప్రస్తావించారు. తమిళంలో 'మూకుత్తి అమ్మన్ 2' సినిమా చేస్తున్నానని, దాంతో పాటు త్వరలోనే ఒక తెలుగు-తమిళ ద్విభాషా చిత్రం కూడా మొదలుకానుందని, ఆ ప్రాజెక్ట్ కోసం తాను ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని తెలిపారు.

# ఓజీ నుండి క్రేజీ అప్‌డేట్..

## వినాయక చవితి రోజు ఫ్యాన్స్‌కి మరో ట్రీట్




టాకీస్: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ ఓజీ ప్రస్తుతం విడుదలకు రెడీ అవుతోంది. యువ దర్శకుడు సుజిత్ తెరకెక్కిస్తున్న ఈ ప్యాన్-ఇండియా గ్యాంగ్‌స్టర్ థ్రిల్లర్‌ను ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ముంబై బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ జీవితాన్ని ఆధారంగా తీసుకుని తెరకెక్కుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న థియేటర్లలో సందడి చేయబోతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్, ఫస్ట్ సింగిల్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశాయి."ఓజీ"లో పవన్ కళ్యాణ్ పాత్ర యాక్షన్, మాస్ మేనరిజంలతో ప్యాక్ అయి ఉండనుందని చిత్రబృందం హింట్ ఇచ్చింది. చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఈ సినిమాలో ప్రధాన విలన్‌గా కనిపించనున్నాడు. అలాగే అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, ప్రకాశ్ రాజ్, హరీష్ ఉత్తమన్, అభిమన్యు సింగ్, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాకు తమన్ సంగీతం అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన ఓ పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో, మేకర్స్ ప్రమోషన్ స్పీడ్ పెంచారు. తాజాగా వినాయక చవితి కానుకగా (ఆగస్టు 27న) ఓ బ్యూటిఫుల్ మెలోడీ సాంగ్‌ను రెండో పాటగా విడుదల చేయబోతున్నట్టు ప్రకటించారు.

సువ్వి సువ్వి అంటూ సాగే మెలోడి పాటని వినాయక చవితి సందర్భంగా ఆగస్ట్ 27న ఉదయం 10.08 ని.లకి విడుదల చేయనున్నట్టు పోస్టర్ ద్వారా ప్రకటించారు. పోస్టర్‌లో పవన్, ప్రియాంక లుక్ ఆకట్టుకుంటుంది. ఈ పాట కూడా శ్రోతలని ఎంతగానో ఆకట్టుకోనుందని తెలుస్తుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ నటిస్తున్న మరో భారీ చిత్రం "ఉస్తాద్ భగత్ సింగ్" కూడా షూటింగ్ దశలో ఉంది. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పవన్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతుంది. పవన్ అభిమానులు ఇప్పటికే "హరిహర వీరమల్లు" చిత్రంతో కొంత నిరాశకు గురైన నేపథ్యంలో, "ఓజీ"పై భారీ ఆశలు పెట్టుకున్నారు. మాస్ యాక్షన్, స్టైలిష్ ప్రెజెంటేషన్‌తో కూడిన ఈ సినిమా అభిమానులకు ఫెస్టివల్‌గా మారనుంది.

# రూ.100 కోట్ల క్లబ్‌లో విజయ్ సేతుపతి 'సార్ మేడమ్'



టాకీస్: తమిళ నటుడు విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విన్నర్ నటి నిత్యా మీనన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'తలైవన్ తలైవి'. తెలుగులో ఈ సినిమాను సార్‌మేడమ్ పేరుతో డబ్ చేశారు మేకర్స్. ఈ చిత్రం తమిళంలో జూలై 25న విడుదల కాగా.. తెలుగులో ఆగష్టు 01న ప్రేక్షకుల ముందుకు వచ్చి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే తాజాగా ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.100 కోట్ల వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. మరోవైపు ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహించగా.. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్య జ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు.

# విశాల్ 35వ సినిమా 'మకుటం' టీజర్ రిలీజ్

టాకీస్: ఇటీవల మదగదరాజ అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ అందుకున్న నటుడు విశాల్ మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆయన కెరీర్‌లో 35వ




చిత్రంగా రాబోతున్న ఈ చిత్రానికి 'మకుటం' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం ఒక ఆసక్తికరమైన టీజర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాకు రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో విశాల్‌ను ఒక శక్తివంతమైన పాత్రలో చూపించారు. యాక్షన్ సన్నివేశాలు, గ్రాఫిక్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రంలో విశాల్ సరసన దుషారా విజయన్ హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. వారి బ్యానర్‌లో ఇది 99వ చిత్రం.

# సరైన సమయంలో రాజకీయాల్లోకి వస్తా..

## నారా రోహిత్ కీలక వ్యాఖ్యలు

టాకీస్: నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీపై ఇటీవల ఏపీ రాజకీయాల్లో చర్చ జరుగుతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఆయన రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే నారా రోహిత్ స్పందించారు. తాను పొలిటికల్ ఫ్యామిలీ నుంచి వచ్చానని ఆయన గుర్తుచేశారు. సరైన సమయంలోనే రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు.



నారా రోహిత్ నటించిన సుందరకాండ సినిమా ఈ నెల 27వ తేదీన విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా సుందరకాండ టీమ్ ఇవాళ తిరుపతిలో పర్యటించింది. ఈ సందర్భంగా పొలిటికల్ ఎంట్రీపై మీడియా అడిగిన ప్రశ్నకు నారా రోహిత్ సమాధానమిచ్చారు. సరైన సమయంలో తన పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని బదులిచ్చారు.

# దుబాయ్‌లో గ్రాండ్‌గా 'గామా' 5వ ఎడిషన్ ఈవెంట్

## సీఈఓ సౌరభ్ కేసరి



టాకీస్: తెలుగు సినిమా పరిశ్రమలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే గామా 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్టు 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో ఘనంగా జరగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఆకట్టుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గామా సీఈఓ సౌరభ్ కేసరి తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కర్టెన్ రైజర్ ఈవెంట్‌కు ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గామా సీఈఓ సౌరభ్ కేసరితో పాటు వైభవ్ జ్యువెలర్స్ ఎండీ రాఘవ్, జ్యూరీ సభ్యులైన ప్రముఖ దర్శకులు ఏ. కోదండరామిరెడ్డి, బి. గోపాల్, హీరోయిన్లు ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి, దక్షా నాగర్‌కర్, నటుడు వైవా హర్ష పాల్గొన్నారు.

ఈ అవార్డుల కార్యక్రమంలో భాగం కావడం పట్ల ఏ. కోదండరామిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. "ఇలాంటి అవార్డులు నటీనటులకు మల్టీ విటమిన్ టాబ్లెట్స్ లాంటివి. ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించేలా ఉంటాయి" అని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకను వైభవంగా నిర్వహిస్తున్నందుకు గామా చైర్మన్ త్రిమూర్తులు, సీఈఓ సౌరభ్ కేసరిని అభినందించారు.

దర్శకులు బి. గోపాల్ మాట్లాడుతూ, "గామా అవార్డ్స్ ప్రతి సంవత్సరం చాలా గ్రాండ్‌గా జరుగుతున్నాయి. ఈసారి సౌరభ్ కేసరి మరింత ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. సినీ ప్రముఖుల సమక్షంలో హీరోయిన్ల అద్భుతమైన ప్రదర్శనలతో ఈ ఈవెంట్ జరగనుంది" అని తెలిపారు.

# శిల్పా శెట్టి.. గ్లామరస్ లుక్స్



టాకీస్: ఈమధ్యకాలంలో సినీతారల ఫిట్నెస్, గ్లామరస్ లుక్స్ జనాలను ఆశ్చర్యపరుస్తున్నాయి. 40, 50 ఏళ్ల వయసు దాటినప్పటికీ ఏమాత్రం తరగని అందంతో కట్టిపడేస్తున్నారు. టాలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీలకు చెందిన స్టార్స్ తన ఫిట్నెస్, డైట్ సీక్రెట్స్ రివీల్ చేస్తున్నారు. తాజాగా హీరోయిన్ శిల్పా శెట్టి సైతం తన డైట్, ఫిట్నెస్ రహస్యాన్ని వెల్లడించింది. శిల్పాశెట్టి... సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. తెలుగు, హిందీ భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ అమ్మడు.. ప్రస్తుతం బుల్లితెరపై పలు రియాల్టీ షోలకు జడ్జిగా వ్యవహరిస్తుంది. ప్రస్తుతం ఆమె వయసు 50 సంవత్సరాలు. ఇప్పటికీ ఏమాత్రం తరగని అందంతో పాతికేళ్ల అమ్మాయిల కనిపిస్తూ జనాలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. యాభై ఏళ్లు దాటినప్పటికీ ఇప్పటికీ స్లిమ్ గా , ఆరోగ్యంగా కనిపించడం వెనకున్న రహస్యాన్ని వెల్లడించింది. తన లుక్, ఫిట్నెస్ కు కారణంగా ఆహారపు అలవాట్లే ప్రధాన కారణమని తెలిపింది. బరువు తగ్గాలనే ఉద్దేశంతో చాలా మంది బ్రేక్ ఫాస్ట్ మానేస్తారని.. కానీ తాను మాత్రం ఆ తప్పు అస్సలు చేయనని తెలిపారు. ఉదయం నిద్రలేచిన వెంటనే ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిని తాగడంతో తన డే మొదలవుతుందని తెలిపారు. ఆ తర్వాత కాసేపటికి నాలుగు చుక్కల నోనీ జ్యూస్ తీసుకుంటానని చెప్పారు. ఆపై టేబుల్ స్పూన్ కొబ్బరి నూనెతో ఆయిల్ పుల్లింగ్ తప్పనిసరి అని వివరించారు. బ్రేక్ ఫాస్ట్ లో సీజనల్ ఫ్రూట్స్, బాదం పాలు, మ్యూజ్లీ, ఉడికించిన గుడ్లు తీసుకుంటానని అన్నారు. మధ్యాహ్న భోజనంలో నెయ్యి తప్పనిసరిగా ఉంటుందని.. అయితే తాను పాటించే ఆహార అలవాట్లు అందరికీ సరిపడకపోవచ్చని అన్నారు. వైద్యుల సలహాతోనే డైట్, ఫిట్నెస్ ఫాలో కావాలని అన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.